www.vishalabharati.com
epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
30 ఆగస్టు 2023
సంపుటి:1 సంచిక:317

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## సామాన్యులకు కేంద్రం రాఖీ కానుక..

**గ్యాస్ సిలిండర్ ధర రూ. 200 తగ్గింపు**

**హైదరాబాద్,విశాలభారతి:** రక్షాబంధన్ పండుగ వేళ కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు శుభవార్త చెప్పింది. వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.200 తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. మంగళవారం కేంద్ర మంత్రివర్గంలో ఈమేరకు నిర్ణయం తీసుకుంది. గృహ అవసరాల కోసం వంట గ్యాస్ కొనుగోలు చేసే ఉజ్వల పథకం లబ్ధిదారులతోపాటు అన్ని కేటగిరీల వినియోగదారులకు ఈ నిర్ణయం వర్తిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నిర్ణయాన్ని.. రాఖీ పండుగ సందర్భంగా దేశంలోని మహిళలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన కానుకగా అభివర్ణించింది



## ప్రాణం పోయినా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లను

- బీజేపీ టికెట్ ఇవ్వకుంటే రాజకీయాలు పక్కన పెడతా
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్,విశాలభారతి:** తన ప్రాణం పోయినా సెక్యులర్ పార్టీలకు వెళ్లనని.. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. బీజేపీ తనకు టికెట్ ఇవ్వకుంటే.. రాజకీయాలు పక్కన పెడతానని స్పష్టం చేశారు. అంతేకానీ బీఆర్ఎస్, కాంగ్రెస్ వంటి పార్టీల్లో చేరనని.. అలాగే స్వతంత్ర అభ్యర్థిగా కూడా పోటీ చేయనని తేల్చి చెప్పారు. బీజేపీ అధిష్ఠానం తనపై సానుకూలంగా ఉందని.. సరైన సమయం చూసి సస్పెన్షన్

..మిగతా |2| లో

“టీ కాంగ్రెస్‌లో టికెట్ల లొల్లి షురూ అయ్యింది. అభ్యర్థుల ఎంపిక కసరత్తుపై మంగళవారం గాంధీ భవన్‌లో తొలి పీఈసీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డిపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు టికెట్ల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఒకే కుటుంబానికి రెండు టికెట్ల అంశాన్ని హైకమాండ్ చూసుకుంటుందని రేవంత్ చెప్పగా, పీసీసీ చీఫ్‌గా రేవంతే హైకమాండ్‌కు చెప్పాలని ఉత్తమ్ అన్నారు. ఈ సందర్భంగా రెండు సీట్ల చర్చ ఇప్పుడు ఎందుకు అని ప్రశ్నించారు. ఎవరిని టార్గెట్ చేసి చర్చ చేస్తున్నారంటూ ఉత్తమ్ సీరియస్ అయ్యారు. దీంతో నాకు చెప్పడానికి నువ్వెవరు అంటూ ఆగ్రహంతో రేవంత్ సమావేశం నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది.



# టీ కాంగ్రెస్‌లో టికెట్ల లొల్లి!

ఫస్ట్ మీటింగ్‌లోనే గాంధీ భవన్ గరం.. గరం

రెండు టికెట్ల విషయంపై రేవంత్, ఉత్తమ్ మధ్య వాగ్వాదం

మధ్యలోనే వెళ్లిపోయిన పీసీసీ చీఫ్

**విశాల భారతి, స్టేట్ బ్యూరో :**

**బీసీల సీట్లపై హన్మంతరావు పట్టు**

మరో వైపు బీసీలకు ఎన్ని సీట్లు ఇస్తారో చెప్పాలని వి. హనుమంత రావు అడిగారు. ఏ ప్రాతిపదికన సర్వేలు చేస్తున్నారో చెప్పాలని బలరాం నాయక్ అడిగారు. సమావేశం తర్వాత ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ‘అభ్యర్థుల ఎంపిక మీద చర్చ జరిగింది. ఇది ఫస్ట్ మీటింగ్ మాత్రమే. ఆ రెండు సీట్ల మీద హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుంది’ అన్నారు. మహిళలకు ఎన్ని సీట్లు ఇస్తారో చెప్పాలంటూ రేణుకా చౌదరి నిలదీసినట్లు సమాచారం. మహిళలకు ఎన్ని సీట్లు ఇచ్చేది ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించడంతో పాటు.. అలాగే, పీఈసీలో ఒక్కో సభ్యుడు ఒక మహిళా అభ్యర్థిని సిఫార్సు చేయాలని ఆమె కోరినట్లు తెలిసింది. సర్వేలపై మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్ సీరియస్ అయ్యారు. సర్వే ఆధారంగా టికెట్లు ఇచ్చేటప్పుడు ఈ ప్రక్రియ ఎందుకని నిలదీశారు. సర్వేలను ఏ ప్రాతిపదికన చేస్తున్నారో చెప్పాలన్నారు.

## అవసరమైతే నా టికెట్ త్యాగం చేస్తా

ఉద్యమ సమయంలో మంత్రి పదవి త్యాగం

ప్రతి పార్లమెంట్ స్థాయిలో

బీసీలకు రెండు టికెట్స్ ఇవ్వాలన్న రాహుల్ గాంధీ

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**విశాలభారతి,హైదరాబాద్:**

తెలంగాణ అసెంబ్లీకి సంబంధించి బీఆర్ఎస్ లిస్ట్ ప్రకటించిన తర్వాత అసంతృప్తులు బయటపడ్డారు. కానీ కాంగ్రెస్ లో పరిస్థితి మరీ దారుణంగా తయారయ్యేలా ఉంది. ప్రస్తుతానికి జస్ట్ అప్లికేషన్లు మాత్రమే తీసుకున్నారు. ఇంకా లిస్ట్ కూడా బయటకు రాలేదు. కానీ అప్పుడే టికెట్ల గోల మొదలైంది. అవసరమైతే నల్గొండ సీటు సైతం త్యాగం చేస్తానంటూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్టేట్ మెంట్ ఇచ్చారు. బీసీలకోసం తాను త్యాగం చేస్తానంటున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి పదవిని త్యాగం చేసి ప్రత్యేక తెలంగాణవాదంను బలంగా వినిపించిన కోమటిరెడ్డి తాజాగా

..మిగతా |2| లో



## ప్రజాసేవకు.. డబ్బు సంచులకు మధ్య యుద్ధం

నన్ను ఓడించేందుకు బీఆర్ఎస్ కుట్రలు

ప్రశ్నించే గొంతును నొక్కుతారా? ... ప్రజలే నా కుటుంబం

వారే ఓట్లేసి గెలిపిస్తారు ... ములుగు ఎమ్మెల్యే సీతక్క

**విశాలభారతి, ములుగు:**

ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో ములుగు సెగ్మెంట్ ను ఎంతో ప్రతిష్ఠాత్మంగా తీసుకున్నారు. ఇక్కడ ఎమ్మెల్యే ధనసరి అనసూయ అలియాస్ సీతక్క ఎంతో పాపులర్ లీడర్ గా పేరుతెచ్చుకున్నారు. కరోనా టైంలోనూ ఆమె చేసిన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. ప్రజల్లోనూ ఆమెకు మంచి ఆదరణ ఉంది. దీంతో కేసీఆర్ సీతక్క మీద బడే నాగజ్యోతిని బరిలో దింపుతున్నారు. కాగా తనను ఓడించేందుకు బీఆర్ఎస్ డబ్బు సంచులతో సిద్ధమైందని సీతక్క ఆరోపిస్తున్నారు. ములుగు నియోజకవర్గంలో తనను ఓడించడానికి బీఆర్ఎస్ నేతలు డబ్బుల సంచులతో

..మిగతా |2| లో

## మమతా బెనర్జీ టంగ్ స్లిప్

- ఇందిరాగాంధీ చంద్రుడిపైకి వెళ్లారంటూ కామెంట్
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** అంతరిక్షంలోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడు రాకేష్ శర్మ పేరును పొరపాటున బాలీవుడ్ నటుడు రాకేష్ రోషన్ అంటూ గత వారం మాట్లాడిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి తడబడ్డారు. ఈసారి దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చంద్రుడు దగ్గరకు వెళ్లారంటూ వ్యాఖ్యానించి నెటిజెన్ల విమర్శలకు గురయ్యారు. తృణమూల్ కాంగ్రెస్ యువజన విభాగం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మమతా బెనర్జీ

..మిగతా |2| లో



## స్టేషన్ ఘన్‌పూర్ టికెట్ నాకే

- టికెట్ల కేటాయింపులో అధిష్టానం మార్పులు చేసే అవకాశం ఉంది
- ఎమ్మెల్యే రాజయ్య ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్,విశాలభారతి:**

సీఎం కేసీఆర్ తప్పకుండా స్టేషన్ ఘన్ పూర్ అసెంబ్లీ టికెట్ తనకే ఇస్తారని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. టికెట్ల కేటాయింపులో మళ్లీ మార్పులు జరిగే అవకాశం ఉందని.. తప్పకుండా స్టేషన్ ఘన్ పూర్ టికెట్ తనకు రావొచ్చని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో మాదిగలది కీలక పాత్ర అని.. మాదిగల అస్థిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత కేసీఆర్ దేనన్నారు. తనకు టికెట్ రాకపోవడంపై మాదిగలు ఆగ్రహంగా ఉన్నారని చెప్పారు. మందకృష్ణ లాంటి వాళ్లు తనకే మద్దతిస్తున్నారని తెలిపారు. ఎమ్మార్పీఎస్

..మిగతా |2| లో



## నాకు టికెట్ ఎందుకు ఇవ్వలేదు..?

ఎందుకు నిరాకరించారో కేసీఆర్ సమాధానం చెప్పాలి

ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్,విశాలభారతి:**



బండారు లక్ష్మారెడ్డికి టికెట్ ఎందుకు ఇచ్చారో.. ఉద్యమ నాయకుడైన తనకు టికెట్ ఎందుకు నిరాకరించారో ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి డిమాండ్ చేశారు. తాను ఏనాడూ అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని.. అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి తిరిగి టికెట్ కేటాయించారని ఆరోపించారు. ఈ క్రమంలోనే పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ పిలిచి మాట్లాడతారని భావిస్తున్నట్లు తెలిపారు. 10 రోజులు వేచి చూస్తానని.. ఆ తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని స్పష్టం చేశారు. ఉద్యమ నాయకుడినైన తనకు టికెట్ ఎందుకు నిరాకరించారని నిలదీశారు. ఉప్పల్‌లోని తన నివాసంలో కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ఆవిర్భవించిన రెండు నెలలకే తాను పార్టీలో చేరానని సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. 23 ఏళ్లుగా పార్టీ జెండా మోసినట్లు తెలిపారు. అనేక కష్టాలు, కేసులు ఎదుర్కొని పార్టీని కాపాడినట్లు వివరించారు. 2018లో భారీ మెజార్టీతో ఉప్పల్ ప్రజలు తనను గెలిపించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అయితే ఎవరైనా ఆస్తులు సంపాదించుకుంటారని.. తాను మాత్రం ఆస్తులు అమ్ముకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని స్పష్టం చేశారు.



## టీచర్ అభ్యర్థులపై లాఠీ చార్జ్ చేస్తారా?

### కేసీఆర్ మాట మీద నిలబడరా?

- కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలా?
- 13086 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి
- వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల

**విశాలభారతి, హైదరాబాద్:**

టీచర్ అభ్యర్థులపై లాఠీ చార్జ్ చేయడాన్ని వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల తీవ్రంగా ఖండించారు. భావితరాలకు పాఠాలు చెప్పే టీచర్లపై దాడులు చేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. అసెంబ్లీలో ఇచ్చిన వాగ్ధానం ప్రకారం 13086 టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిండు అసెంబ్లీలో ఇచ్చిన మాట కూడా ముఖ్యమంత్రి నిలబెట్టుకోలేరా? అని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్ లో షర్మిల మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు కూడా మాట మీద నిలబడరా? అంటూ ఫైర్ అయ్యారు. కొలువుల

..మిగతా |2| లో

పెరిగిన అర్చకుల గౌరవ వేతనం

|2| లో



## భయమా.. వ్యూహమా..!

- కేసీఆర్ లో కనిపించని దూకుడు స్వభావం
- ఎన్నికల వేళ గులాబీ బాస్ ఎందుకు జంకుతున్నరు?
- నియోజకవర్గాల్లో గళం విప్పుతున్న అసంతృప్తులు
- హైకమాండ్‌కు సవాల్ విసురుతున్నా స్పందన నిల్
- బుజ్జగింపులు చేస్తున్నా.. బాస్ ఆదేశాలు బేఖాతర్
- అయినా పట్టించుకోని అధినేత తీరుపై జోరుగా చర్చలు
- పెద్దసారుకు ఏమైందో అనుకుంటూ గుసగుసలు



## తెలంగాణపై ప్రియాంక గాంధీ ఫోకస్

పాలిట్రిక్స్ 3లో

విశాల భారతి
vishalabharathi Telugu Daily
బుధవారం, 30 ఆగస్టు 2023 | హైదరాబాద్

# పెరిగిన అర్చకుల గౌరవ వేతనం

**హైదరాబాద్,విశాలభారతి:** దూపదీప నైవేద్యం కింద ఇచ్చే అలవెన్సును ప్రభుత్వం పెంచింది. నెలకు ఇచ్చే మొత్తం ఆరు వేల రూపాయల నుంచి పది వేల రూపాయలకు పెంచింది. అర్చకుల గౌరవ వేతనం ఆరు వేల రూపాయలకు పెంచింది. ఆలయ కోసం నాలుగు వేల రూపాయలు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బ్రాహ్మణ సంక్షేమ భవనం ప్రారంభోత్సవంలో సిఎం కెసిఆర్ హామీ ఇచ్చారు. సిఎం హామీ మేరకు దేవాదాయ శాఖ విభాగం ఉత్తర్వులు జారీ చేశారు.

# అవసరమైతే నా టికెట్ త్యాగం చేస్తా



మొదటిపేజీ తరువాయి

బిసిల కోసం తన సిట్టింగ్ సీట్ త్యాగం చేస్తాననడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

**బీసీ రాజకీయం..**

తెలంగాణ కాంగ్రెస్ లో ఈసారి బీసీలు టికెట్ల కోసం గట్టిగా పట్టుబడుతున్నారు. బీఆర్ఎస్ తో పోటీ పెట్టుకోకుండా ప్రతి పార్లమెంట్ పరిధిలో కనీసం 2 స్థానాలు బీసీలకు ఇవ్వాలంటున్నారు. అయితే గెలుపు ఓటముల బలాబలాలు బేరీజీ వేసుకోవాలని ఇతర కులాల నాయకులు సూచిస్తున్నారు. ఈ గొడవ తేలకముందే అప్లికేషన్లు తీసుకున్నారు. అయితే తమతోపాటు తమ అనుచరులకు కూడా టికెట్లు ఇప్పించుకోవాలనే పట్టుదలతో ఉన్న కోమటిరెడ్డి వంటి నేతలు కాస్త ఇబ్బంది పడుతున్నారు. నకిరేకల్ నియోజకవర్గానికి సంబంధించి వేముల వీరేశం టికెట్ విషయమై ఇటీవలే అనుచరులతో మంతనాలు జరిపారు కోమటిరెడ్డి. పక్క పార్టీనుంచి వస్తే టికెట్ ఇవ్వాలా అని ప్రశ్నించారాయన. ఈ క్రమంలో బీసీలకు తన సీటు సైతం త్యాగం చేస్తానంటూ కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి.

**బీఆర్ఎస్ పై విమర్శలు**

తెలంగాణలో హామీల అమలు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి. ఎన్నికల ముందు కేటీఆర్ అమెరికా పర్యటనలో ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తం చేశారాయన. కాంగ్రెస్ తరపున అప్లికేషన్లు పెట్టుకున్న నాయకులందరితో వన్ టు వన్ ఇంటర్వ్యూ ఉంటుందని, ఆ తర్వాతే టికెట్ల కన్ఫర్మేషన్ ఉంటుందని చెప్పారు.

# ప్రాణం పోయినాబీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లను

మొదటిపేజీ తరువాయి

వేటు ఎత్తివేస్తారని రాజాసింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గోషామహల్ బీఆర్ఎస్ టికెట్ ముస్లింల చేతిలో ఉందని.. దారుసలామ్ నుంచి గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థిని ఎంపిక చేస్తారని అన్నారు. కాగా, తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ ఇరుకున పడుతున్నారంటూ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై బీజేపీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని భావించి బీజేపీ క్రమశిక్షణ సంఘం.. గతేడాది ఆగస్టు 23వ తేదీన రాజాసింగ్పై సస్పెన్షన్ వేటు వేసింది. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు ఆయనపై చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. అలాగే శాసనసభాపక్ష పదవి నుంచి కూడా తొలగించింది. అనంతరం అప్పటి నుంచి ఎమ్మెల్యేను పార్టీ కార్యకలాపాలకు దూరంగా పెడుతూ వస్తుంది.

# స్టేషన్ ఘన్‌పూర్ టికెట్ నాకే

మొదటిపేజీ తరువాయి

నుంచి తన ప్రస్థానం మొదలైందన్నారు రాజయ్య. పార్టీ జాబితాలో చేర్పులు,మార్పులు ఉంటాయని.. రాష్ట్ర సాధనకు కృషి చేసిన తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ప్రత్యక్ష రాజకీయాల్లోనే ఉంటానని చెప్పారు. ఎమ్మెల్సీ, ఎంపీ పదవులు ఇస్తామంటున్నారు. కానీ తనకు ఎమ్మెల్యేనే కావాలన్నారు. పార్టీ మారడమా లేదా అనేది కాలం నిర్ణయిస్తుందన్నారు.

# టీచర్ అభ్యర్థులపై లాఠీ చార్జ్ చేస్తారా?

మొదటిపేజీ తరువాయి

కోసం తెలంగాణ తెచ్చుకున్న నిరుద్యోగులను కొట్టే హక్కు నీకెక్కడిది? అంటూ మండిపడ్డారు. 'ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా యువత రక్తాన్ని కండ్ల చూస్తావా? నీ కుటుంబానికి ఐదు ఉద్యోగాలుంటే సరిపోతుందా?తొమ్మిదేళ్లుగా టీచర్ పోస్టుల ఊసే ఎత్తకుండా నామమాత్రంగా పోస్టులు భర్తీ చేసి, ఓట్లు దండుకుందామనా? మాటతప్పితే తల నరుక్కునే నైజమే అయితే? నరం మీద నాలుకే ఉంటే 13086 టీచర్ పోస్టులకు కేసీఆర్ వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి. డీఎడ్ బీఎడ్ అభ్యర్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- టాస్క్ ఆధ్వర్యంలో ఐటీ జాబ్‌మేళా
- ప్రారంభించిన ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్,విశాలభారతి:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐటీ జాబ్‌మేళాను ఎమ్మెల్సీ కవిత ప్రారంభించారు. జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చారు. ఇందులో గ్లోబల్ లాజిక్‌తోపాటు వివిధ విదేశీ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా ప్రఖ్యాతి చెందిన 41 కంపెనీలు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. జాబ్‌మేళాలో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెప్పారు. గత జాబ్‌మేళాలో ముగ్గురు దివ్యాంగులకు ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. యువత కోసం ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గ్రామీణ యువతకు ఇది గొప్ప అవకాశమని చెప్పారు. ప్రతి నెలా ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే గణేశ్ గుప్తా అన్నారు. ఎమ్మెల్సీ కవిత సహకారంతో ఎన్నో విదేశీ కంపెనీలు ఇక్కడికి వచ్చాయన్నారు.

# ఆయనకి కస్టర్డ్ ఆపిల్‌కి, జామపండుకు తేడా తెల్వదు

- కేసీఆర్‌ను మెప్పించేందుకు కవితని పొగుడుతున్నరు
- మంత్రి ప్రశాంత్ రెడ్డిపై ఎంపీ అర్వింద్ సెటైర్లు



**హైదరాబాద్,విశాలభారతి:** మంత్రి ప్రశాంత్ రెడ్డికి కస్టర్డ్ ఆపిల్ కు జామపండుకి తేడా తెల్వదని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సెటైర్లు వేశారు. కవిత కాంగ్రెస్ నేతలని పొగుడుతుంటే మంత్రి ప్రశాంత్ మొహం వాడిపోయిందన్నారు. కేసీఆర్ దగ్గర మెప్పు పొందేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు కవితని పొగుడ్తుంటే... కవిత మాత్రం కాంగ్రెస్ వాళ్ళని పొగుడుతుందని ఎద్దేవా చేశారు. కవిత, మంత్రి ప్రశాంత్ పసుపు రైతులకు చేసిందేమి లేదన్నారు. పసుపు ఎగుమతులను పెంచాం కాబట్టే రైతులకు మంచి ధరలు వస్తున్నాయని చెప్పారు. ఈ సారి కవిత తనపై పోటీ చేస్తే మూడో స్థానానికే పరిమితం అవుతుందన్నారు. కేసీఆర్ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు అర్వింద్. మైనారిటీల సంక్షేమానికి కేంద్రం వేల కోట్లు ఇస్తున్నా.. బీజేపీ మైనారిటీలకు వ్యతిరేఖమని కొన్ని పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. రాష్ట్రం బాగుండాలంటే కేసీఆర్ ని ఇంటికి పంపాలని సూచించారు. కేంద్రం పసుపు రైతుల బాగు కోసం పాటుపడుతుందని.. గ్రీస్ లో జరిగిన జీ20 సమ్మిట్ లో ప్రధాని నిజామాబాద్ పసుపుని ప్రస్తావించటమే ఇందుకు నిదర్శనమని చెప్పారు.

# మమతా బెనర్జీ టంగ్ స్లిప్

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ, ఇందిరాగాంధీ చంద్రుడి పైకి వెళ్లినప్పుడు రాకేష్ (శర్మ)ను అక్కడి నుంచి హిందుస్థాన్ ఎలా ఉందని అడిగారని, ప్రపంచంలోనే ఉత్తమంగా ఉందని ఆయన బదులిచ్చారని చెప్పారు. రాకేష్ శర్మ వాస్తవానికి అంతరిక్షంలోకి వెళ్లగా, మమత మాత్రం చంద్రుడి పైకి అంటూ ప్రస్తావించారు. ఇందిరాగాంధీ చంద్రుడి దగ్గరకు వెళ్లినప్పుడు...అంటూ మాట్లాడారు. దీంతో మమత నెట్టింట ట్రోలింగ్‌కు గురయ్యారు. ఇందిరాగాంధీ చంద్రుడి దగ్గరకు వెళ్లిన విలువైన సమాచారం ఇస్రోకు తెలుసా అంటూ ఓ నెటిజన్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

# నిరుద్యోగులపై దాడి నియంత పాలనకు నిదర్శనం

- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి
- అసెంబ్లీలో సీఎం ఇచ్చిన హామీని అడిగితే దాడి చేస్తారా?
- ఖాళీగా ఉన్న అన్ని టీచర్ పోస్టులు భర్తీ చేయాలి
- నిరుద్యోగుల పోరాటానికి బీజేపీ మద్దతు ఉంటుందని స్పష్టం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరెట్ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న డీఎడ్, బీఎడ్ అభ్యర్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి మండిపడ్డారు. నిజాం కాలేజీ నుంచి స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీస్ కు వెళ్తున్న అభ్యర్థులను అసెంబ్లీ వద్ద అడ్డుకొని పోలీసులు లాఠీచార్జ్‌కి పాల్పడడం దుర్మార్గం అన్నారు. డీఎడ్. బీఎడ్ అభ్యర్థుల పైన పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి విచక్షణారహితంగా దాడి చేయడమేమిటని ప్రశ్నించారు. అధికార పార్టీకి కొమ్ముగాస్తూ..నిరసన చేపట్టిన అభ్యర్థులను 'కొట్టండి, ఈడ్చేయండి' అంటూ పోలీసులకు ఆదేశాలివ్వడం, దాడికి పురిగొల్పడాన్ని, మీడియా ప్రతినిధులపై కూడా దాడికి పాల్పడేలా ప్రభుత్వం ప్రోత్సహించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎమర్జెన్సీ లాంటి చీకటి రోజులు ఉన్నాయనడానికి కేసీఆర్ నియంత పాలన అనడానికి జరుగుతున్న ఘటనలే సాక్ష్యాలు అని కిషన్‌రెడ్డి అన్నారు. ఇటీవల గ్రూప్2 పరీక్షల నిర్వహణ వాయిదా వేయాలని కోరుతూ నిరుద్యోగులు ధర్నా చేస్తే మహిళలని కూడా చూడకుండా పోలీసులు లాఠీచార్జ్ చేసి అక్రమంగా అరెస్టు చేయడం.. కేసీఆర్ నిరంకుశ పాలనకు నిదర్శనం.

అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం 13వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అడిగితే పోలీసులతో దాడి చేయిస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 13,500 టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే.. తూతూమంత్రంగా కేవలం 5వేల పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ రిలీజ్ చేయడం బాధాకరమన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. పోస్టుల పెంపు కోసం నిరుద్యోగులు చేస్తున్న పోరాటానికి బీజేపీ మద్దతుగా నిలుస్తుందని కిషన్‌రెడ్డి అన్నారు.

టీఎస్పీఎస్సీ అసమర్ధత కారణంగా రద్దయిన గ్రూప్ 1 కు సంబంధించిన మెయిన్ పరీక్ష నిర్వహించేందుకు ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లినట్లేనన్నారు. వెంటనే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాం. టీఎస్పీఎస్సీలో ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చి పెండింగ్ లో ఉన్న అన్ని రకాల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు.



# ప్రజాసేవకు.. డబ్బు సంచులకు మధ్య యుద్ధం

మొదటిపేజీ తరువాయి

దిగుతున్నారని అక్కడి ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. ప్రజా సేవకు డబ్బు సంచులకు మధ్య యుద్ధం మొదలైందని అన్నారు. తాను ఎక్కడా భూ కబ్జాలకు పాల్పడలేదని అన్నారు. ప్రశ్నించే గొంతు నొక్కడానికే బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మంగళవారం (ఆగస్టు 29) మీడియా సమావేశం నిర్వహించారు. మిడతల దండు తరహాలో బీఆర్ఎస్ నాయకులు వస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ మంత్రులకు పక్క నియోజకవర్గాల మీద ఉన్న ప్రేమ తమ నియోజకవర్గాల మీద ఉండటం లేదని అన్నారు. ప్రశ్నించే గొంతును అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకోవడానికి పెద్ద కుట్రకు తెరలేపుతున్నారని సీతక్క విమర్శించారు. సీతక్క బాగా పని చేస్తుందని అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలే పొగుడుతున్నారని.. కానీ, ఇక్కడికి వచ్చి ఓడించమంటున్నారని అన్నారు. ప్రజల్లో తనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్చుకోలేక తనను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. ప్రజలే తన కుటుంబం అని, నియోజకవర్గ ప్రజలే తనను ఆశీర్వదిస్తారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులంతా దండయాత్రలు చేసి ములుగును భయాందోళనకు గురిచేస్తున్నారని అన్నారు.

**కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..**

కాంగ్రెస్ పార్టీ ములుగు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్ర మొగిలితో పాటు మరికొందరు ఆదివారం (ఆగస్టు 27) నాడు బీఆర్ఎస్ లో చేరారు. బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కన్నాయిగూడెం మండలాన్ని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో ములుగు మండలం అబ్బపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ లీడర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఉయ్యాల రాజయ్య గౌడ్ ఆధ్వర్యంలో సర్పంచ్ గండి కల్పన కుమార్, మాజీ ఎంపీటీసీ ఆకుతోట చంద్రమౌళి, ఉప సర్పంచ్ నల్లెల్ల ప్రభాకర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కంచెం కొమరయ్య, జిల్లెల్ల చిన్నమల్లు, కంచెం కొమరయ్య, బాణాల తిరుపతి, జంగిలి రాజు, చెమ్మల విజేందర్, చెమ్మల సంతు, మోలుగురి మహేష్ చిక్కుల రాజు, కంచెం గట్టయ్య, వంగపల్లి మహేష్, బుస పర్వతాలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఇంకా బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో గ్రామస్థాయి నాయకులు ఉయ్యాల వెంకటేష్, సాయబోయిన మల్లయ్య, గువ్వ రాజు, కంచెం రాజేందర్, సూర లింగ మూర్తి, బొల్ల శంకర్, చొప్పరి నాగరాజు సాయబోయిన మల్లయ్య, జక్కుల తిరుపతి, కంచెం రవి, బుట్టి స్వామి, వంగపల్లి రవి, మామిడిశెట్టి రమేష్, చొప్పరి విజేందర్, యార సురేందర్, బుస చిన్నపర్తి, రాస కుమార్, బస రవి రుద్రబోయిన రాజయ్య తదితరులు ఉన్నారు.



# కారుణ్య నియామకాల్లో ముజీబ్ కృషి అభినందనీయం

ఘనంగా సన్మానించిన ఉద్యోగులు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** కారుణ్య నియామకాల్లో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముజీబ్‌హుసేనీ కృషి అభినందనీయమని అధికారులు, టీఎన్జీవో ఉద్యోగులు కొనియాడారు. మంగళవారం ముజీబ్ హుసేనీ ఆధ్వర్యంలో సివిల్‌సప్లై డైరెక్టర్ అనిల్ కుమార్, జాయింట్ డైరెక్టర్‌ఉషారాణి , సివిల్‌సప్లై సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి కలిసి శాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు ఇచ్చినందుకు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సివిల్‌సప్లై డైరెక్టర్‌అనిల్‌కుమార్ మాట్లాడుతూ పదోన్నతుల విషయంలో ముజీబ్ చేసిన కృషి గ్రేట్ అన్నారు. శాలువా కప్పి సన్మానించారు. అనంతరం సంఘ భవనంలో జిల్లా విద్యాశాఖ ఉద్యోగులు, సివిల్‌సప్లై శాఖ ఉద్యోగులు కలిసి డాక్టర్ ముజీబ్ ను , సెక్రటరీ విక్రమ్ కుమార్ ను సన్మానించారు. విద్యాశాఖలో 48 మందికి ఒకేసారి కారుణ్య నియామకాలు జరపడంలో డాక్టర్ ముజీబ్ రెండేండ్లు విశేష కృషి చేశారన్నారు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు నేడు ఆసరా దొరికిందని జిల్లా సహాధ్యక్షుడు , జిల్లా విద్య శాఖ అధ్యక్షుడు కే ఆర్ రాజ్ కుమార్ అన్నారు. కొత్తగా ఉద్యోగం లో చేరిన ఉద్యోగులు కూడా ముజీబ్ కృషిని కొనియాడారు. అనంతరం డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ జీవో నెంబర్ 79 విడుదల చేసి కారుణ్య నియామకాలు జరిగేలా చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత , టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఎం జగదీశ్వర్ కు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారందరూ క్రమశిక్షణతో పనిచేస్తూ కుటుంబ సభ్యులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమములో జిల్లా కార్యవర్గ సభ్యులు కుర్రాడి శ్రీనివాస్ , ఖాలెద్ అహ్మద్, వైదిక్ శస్త్ర ముఖీమ్ ఖురేషి , సివిల్‌సప్లై యూనిట్ సభ్యుడు రజ్వి , సుధీర్, నందరాజు, తదితరులు పాల్గొన్నారు

# నేటి నుంచే ఆసియా కప్

**ఆసియా కప్ 2023: పూర్తి షెడ్యూల్**

- ఆగస్టు 30: పాకిస్థాన్ vs నేపాల్, ముల్తాన్, పాకిస్థాన్,
- ఆగస్టు 31: బంగ్లాదేశ్ vs శ్రీలంక, క్యాండీ, శ్రీలంక, మధ్యాహ్నం 3 గంటలకు
- సెప్టెంబర్ 2: పాకిస్థాన్ vs ఇండియా, క్యాండీ, శ్రీలంక, 3 మధ్యాహ్నం
- సెప్టెంబర్ 3: బంగ్లాదేశ్ vs ఆఫ్ఘనిస్తాన్ , లాహోర్, పాకిస్తాన్, 2:30 pm
- సెప్టెంబర్ 4: భారతదేశం vs నేపాల్, కాండీ, శ్రీలంక, 3 pm
- సెప్టెంబర్ 5: శ్రీలంక vs ఆఫ్ఘనిస్తాన్, లాహోర్, పాకిస్తాన్, 2:30 pm
- సెప్టెంబర్ 6: A1 vs B2, లాహోర్, పాకిస్తాన్, 2:30 pm
- సెప్టెంబర్ 9: B1 vs B2, కొలంబో, శ్రీలంక, 3 pm
- సెప్టెంబర్ 10: A1 vs A2, కొలంబో, శ్రీలంక, 3 pm
- సెప్టెంబర్ 12: A2 vs B1, కొలంబో, శ్రీలంక, 3 pm
- సెప్టెంబర్ 14: A1 vs B1, కొలంబో, శ్రీలంక, 3 pm
- సెప్టెంబర్ 15: A2 vs B2, కొలంబో, శ్రీలంక, 3 pm
- సెప్టెంబర్ 17: ఫైనల్ (సూపర్ ఫోర్స్ 1 vs సూపర్ ఫోర్స్ 2), కొలంబో, శ్రీలంక, 3 pm




ప్రపంచ క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆసియా కప్ 2023 ప్రారంభానికి సిద్ధమైంది. నేటి నుంచే టోర్నీ ప్రారంభం కానుంది. పాకిస్థాన్‌లోని ముల్తాన్ వేదికగా బుధవారం పాకిస్థాన్, నేపాల్ జట్ల మధ్య తొలి సమరం జరగబోతుంది. ఈ కాంటినెంటల్ క్రికెట్ టోర్నీ వన్డే ఫార్మాట్‌లో జరగనున్నాయి. నిజానికి ఈ ఆసియా కప్ టోర్నీ మొత్తం పాకిస్థాన్‌లోనే జరగాల్సి ఉన్నా, భారత్, పాకిస్థాన్‌లో ఆడేందుకు సిద్ధంగా లేని కారణంగా టోర్నీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. దాంతో పాకిస్థాన్‌లో కొన్ని మ్యాచ్‌లు, శ్రీలంకలో కొన్ని మ్యాచ్‌లు జరగనున్నాయి. పాక్‌లో 4 మ్యాచ్‌లు, లంక గడ్డపై 9 మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

**పాక్, భారత్ హై లెవల్ మ్యాచ్**

క్రికెట్ మ్యాచ్ అనగానే క్రికెట్ అభిమానుల చూపు మొత్తం భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌పైనే ఉంటాయి. ఈ దాయాదుల పోరుకుండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. భారత్‌పాక్ జట్లు తలపడుతున్నాయంటే అది కేవలం ఒక క్రికెట్ మ్యాచ్ మాత్రమే కాదు అందుకు మించి ఉంటుంది. ఆటతో పాటు భావోద్వేగాల సమరంగా సాగుతుంది. ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థులు ఇండియా వర్సెస్ పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 2న జరుగనుంది. శ్రీలంకలోని పల్లకెలే స్టేడియం ఈ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్ మ్యాచ్‌లు అన్ని శ్రీలంకలోనే ఉంటాయి. అలాగే సెప్టెంబర్ 17న శ్రీలంకలో ఫైనల్ మ్యాచ్‌కు షెడ్యూల్ ఖరారైంది.

**విన్నర్ లిస్ట్ లో భారత్ టాప్**

రెండు గ్రూపులలో టాప్2 స్థానాల్లో నిలిచిన జట్లు టోర్నీలో ముందడుగు వేస్తాయి. ఒక గ్రూప్‌లో భారత్, పాకిస్తాన్, నేపాల్ ఉండగా.. మరో గ్రూపులో డిఫెండింగ్ ఛాంపియన్ శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ ఉన్నాయి. ఆసియా టోర్నీ 2022 వరకూ మొత్తం 15 సార్లు జరిగింది. 2022లో అసలు ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన శ్రీలంక జట్టు ఏకంగా కప్పు గెలిచి సంచలనం సృష్టించింది. అందులో అత్యధికంగా ఏడుసార్లు భారత్ కప్ కైవసం చేసుకుంది. శ్రీలంక జట్టు ఆరుసార్లు అందుకుంది.



పాలిట్రిక్స్

# తెలంగాణపై ప్రియాంక గాంధీ ఫోకస్



జులై, ఆగస్టులో రెండు సార్లు సర్వే

**నియోజక వర్గాల్లో పెరిగిన కాంగ్రెస్ గ్రాఫ్..**

**రాష్ట్రం హస్తగతమయ్యేలా సర్వే ఫలితాలు..**

**బీఆర్ఎస్ కు 57.06 శాతం వ్యతిరేకత..**

**విశాల భారతి, స్టేట్ బ్యూరో :**

ప్రియాంకగాంధీ, రాహుల్ గాంధీ తెలంగాణ పై ప్రత్యేక దృష్టి సాధించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలే ప్రనాళికలు రచించారు. అందులో భాగంగానే సెప్టెంబర్ నెలలో మరోసారి రాష్ట్రానికి ప్రియాంక గాంధీ రానున్నారని సమాచారం. కాగా ఇప్పటి వరకు డిక్లరేషన్ పేరుతో ప్రజల్లోకి వెళ్తున్న కాంగ్రెస్ ను ఈ సారి ప్రజలు ఆదరిస్తారని నేతలు ఆశిస్తున్నారు.

ప్రియాంక గాంధీ రాష్ట్రానికి వస్తే నేతల్లో ఇటు ప్రజల్లో కూడా విశ్వాసం పెరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు చెప్పుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు తెలియకుండా సర్వేలు చేయించారు. జులై లో సర్వే చేయగా కాంగ్రెస్ పార్టీకి 32.06 శాతం ప్రజల్లో ఆధరణ ఉందని తేలింది. ఆగష్టు లో మరో సారి సర్వే చేయించగా అధికార పార్టీ కంటే రెండు శాతం ఓట్లు కాంగ్రెస్ వైపు మళ్లినట్లు సర్వే రావడం తో ప్రియాంక గాంధీ తెలంగాణ పై పూర్తి స్థాయిలో దృష్టి సారించే అవకాశం ఉందని తెలుస్తుంది. ఇక అధికార పార్టీ లో వ్యతిరేకత కూడా అంతే విధంగా పెరుగుతోందని తేలింది. దీనితో పూర్తిస్థాయిలో అధికారం చేపట్టేందుకు తెలంగాణ లో అనుకూలత ఉందని ఢిల్లీ నేతలకు చెప్పుతున్నారు. ఈ విషయం పై రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు దిశానిర్ధేశం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

కొద్దిరోజుల క్రితం పార్టీలో కోవర్టులు ఉన్నారు.. వారు పార్టీ సమాచారాన్ని ఇతర పార్టీలకు చేరవేస్తున్నారనే ఆరోపణలు వినిపించాయి. కానీ ఇప్పటి వరకు ఎవ్వరు పార్టీని వీడి బయటకు వెల్లిన వారు లేరు. మరో వైపు కొద్ది మంది నేతల పార్టీ నియమాలను ఉల్లంగించి ఇతర పార్టీ నేతలతో టచ్ లో ఉన్నారని ఆరోపణలు వినిపించాయి. వాటిని పట్టించుకునే పరిస్థితి పార్టీ లో లేదు. అద్యక్షులు రేవంత్ రెడ్డి తన పని తాను చేసుకుంటు దూసుకుపోతున్నారు.

ఎన్నికలసమయం దగ్గపడుతున్న నేపథ్యం లో పార్టీలో ఎవరకి టిక్కెట్స్ ఇవ్వాలి అన్న స్తబ్దత కొనసాగుతోంది. ఇప్పటికే ఏఐసీసీ అద్యక్షులు ఖర్గే పార్టీ నేతలకు సమావేశం నిర్వహించారు. పోటీలో నిలబడే అభ్యర్థుల ను వెంటనే ప్రకటించాలని రాష్ట్ర నేతలకు అల్టిమేటం జారీ చేశారు. మరో వైపు అధికార పార్టీ 115 మంది అభ్యర్థులను ప్రకటించడంతో కాంగ్రెస్ లో కూడా అభ్యర్థుల ఎంపిక మొదలైంది. దీనితోడు ప్రియాంక గాంధీ ఇచ్చి సర్వేలు కూడా తోడుకానున్నాయి. అధికార పార్టీ కి 57.62శాతం వ్యతిరేకత ఉందని దాన్ని సొమ్ము చేసుకుంటే కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా అధికారం లోకి రావడం ఖామని నేతలు భావిస్తున్నారు.

ఒకవైపు తెలంగాణ రాష్ట్రం లో అధికారం కోసం పార్టీ డిక్లరేషన్ కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. ఇటు కాంగ్రెస్ పార్టీకి ప్రజలనుండి ఆదరణ పెరుగుతోంది. దీనికి తోడు అధికార పార్టీ పై ప్రజల్లో వ్యతిరేకత పెరగడం, వామపక్షాలు కూడా కలిసి వస్తే కాంగ్రెస్ అధికారం లోకి రావడం ఖాయం.

# తుమ్మల, పొంగులేటి, జలగం కలిస్తే..?

- ఉమ్మడి ఖమ్మంలో బీఆర్ఎస్ కు కష్టాలే
- లెఫ్ట్ పార్టీల దూరంతో పలుచోట్ల భారీగా గండి
- జంగ్ సైరన్ మోగించిన అసంతృప్తులు
- కాంగ్రెస్ కండువా కప్పకోవడం లాంఛనమే
- ఖమ్మంను కాంగ్రెస్ ఖాతాలో వేసేందుకు యత్నాలు



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

బీఆర్ఎస్ లో 115 మంది అభ్యర్థులను ప్రకటించిన తర్వాత అసంతృప్తులు గళం విప్పుతున్నారు. మౌనంగా ఉంటే అదే అంగీకారమవుతుందని భావించిన నేతలు మెల్లగా స్వరం పెంచుతున్నారు. పాలేరు టికెట్ ఆశించిన తుమ్మల నాగేశ్వర్ రావు తాను పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. సుమారు వెయ్యి కార్లు, 2 వేల బైక్‌లతో ఆయన దండయాత్ర చేసి బీఆర్ఎస్ పెద్దలకు సవాల్ విసిరారు. ఆయనకు టికెట్ రాకపోవడంతో ఆయన అనుచరులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. పార్టీ మారైనా పాలేరు నుంచి పోటీ చేయాలని ఆయన అనుచరులు డిమాండ్ చేయడం గులాబీ శ్రేణుల్లో కలవరం పుట్టిస్తోంది. ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసినట్టు తుమ్మల స్పష్టం చేశారు. అయితే తుమ్మల మాటల బట్టి చూస్తే ఆయన పాలేరు నుంచి కాకుండా ఖమ్మం నుంచే పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఆయనతో పాటు కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్టు సమాచారం.

**పువ్వాడ తీరుతోనే నష్టం**

మరోవైపు జిల్లా మంత్రిగా అందరినీ సమన్వయం చేయాల్సిన పువ్వాడ అజయ్‌కుమార్ పార్టీలో ఇంకో వర్గాన్ని ఎదగనీయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. పువ్వాడ తీరుతోనే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. తుమ్మల కూడా నేరుగా మంత్రిపై ఆరోపణలు చేయకున్నా ఖమ్మం నుంచే పోటీ చేసి ఆయనను ఓడించాలనే కృత నిశ్చయంతో ఉన్నట్టు తెలుస్తోంది. పాలేరు నుంచి షర్మిల పోటీ చేస్తానని ఇప్పటికే ప్రకటించడంతో తుమ్మలకు ఖమ్మం నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పెద్దలు ఆఫర్ చేసినట్టు తెలుస్తోంది.

**పావులు కదుపుతున్న 'పొంగులేటి'**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ నుంచి ఒక్క ఎమ్మెల్యేను కూడా అసెంబ్లీలో అడుగుపెట్టనివ్వనని సవాల్ విసిరిన 'పొంగులేటి' పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం నియోజకవర్గాలను కాంగ్రెస్ ఖాతాలో జమ చేసేందుకు కృషి చేస్తున్నారు. తుమ్మల నాగేశ్వర్‌రావు, జలగం వెంకటరావులను పార్టీలోకి తీసుకొస్తే మెజారిటీ అసెంబ్లీ స్థానాలతో పాటు ఎంపీ సీటును కూడా గెలుచుకోవచ్చనే యోచనలో పావులు కదుపుతున్నారు. దానికి అనుగుణంగానే ఆయన అడుగులు వేస్తున్నట్టు తాజా పరిస్థితులను చూస్తే అర్థమవుతోంది.

**వామపక్షాల సవాల్**

ఇదిలా ఉండగా.. వామపక్షాలు కూడా తాము బలంగా ఉన్నచోట బరిలో ఉంటామని ప్రకటించారు. వారికి ఖమ్మంలో బలమైన ఓటు బ్యాంకు ఉంది. తమ బలాన్ని తక్కువ అంచనా వేసిన బీఆర్ఎస్ అధినేతకు తమ సత్తా ఏమిటో చూపెడుతామని వామపక్ష నేతలు ఇప్పటికే చెప్పారు. ఈ నేపథ్యంలో ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు కాంగ్రెస్ తో వామపక్షాలు కలిసి నడిచే అవకాశం ఉందని పొలిటికల్ అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. దీంతో ఖమ్మం జిల్లా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకు గండిపడే ప్రమాదం ఉన్నది. అదే జరిగితే బీఆర్ఎస్‌కు డేంజర్ బెల్స్ ఖాయమనే వాదనలు వినిపిస్తున్నాయి.

> “ తెలంగాణ సీఎం కేసీఆర్ మారిపోయారు. గతంలో ఉండే ఫైర్ ఇప్పుడు తగ్గినట్టు కనిపిస్తోంది. గత రెండు దఫాలుగా గెలిచినప్పుడు సార్‌లో ఉండే దూకుడు ఇప్పుడు కనిపించడం లేదు. చూసుకుందాం రా.. అన్నట్లుగా ఉండే ఆయన స్వభావం పూర్తిగా మారినట్లు అనిపిస్తోంది. మరీ ముఖ్యంగా ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడినా, తిరుగుబాటు చేసినా.. ఎదురుతిరుగుతారనే ఆలోచన వచ్చినా సరే ఎంతటి పెద్ద నేతనైనా.. అంతకుమించి ఆర్థికంగా, రాజకీయంగా బలమున్నా సరే గడ్డిపోచలా తీసి పక్కకు పెట్టేవారు. కానీ ముచ్చటగా మూడోసారి ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ గులాబీ బాస్ ఎందుకు జంకుతున్నారు ? కొందరు దీన్నే భయమని అంటుంటే.. ఇంకొందరేమో ఇదంతా వ్యూహాత్మకం అంటున్నారు.



# భయమా.. వ్యూహమా..!?

**కేసీఆర్ లో కనిపించని దూకుడు స్వభావం**

**ఎన్నికల వేళ గులాబీ బాస్ ఎందుకు జంకుతున్నరు?**

**నియోజకవర్గాల్లో గళం విప్పుతున్న అసంతృప్తులు**

**హైకమాండ్‌కు సవాల్ విసురుతున్నా స్పందన నిల్**

**బుజ్జగింపులు చేస్తున్నా.. బాస్ ఆదేశాలు బేఖాతర్**

**అయినా పట్టించుకోని అధినేత తీరుపై జోరుగా చర్చలు**

**పెద్దసారుకు ఏమైందో అనుకుంటూ గుసగుసలు**

### ర్యాలీలు, బలప్రదర్శనలు

ఖమ్మం జిల్లా కీలక నేత, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోటీ చేస్తానని బహాటంగానే చెప్పేశారు. 1000 కార్లతో దండయాత్ర చేసినంత పని చేశారు. దీంతో ఖమ్మం జిల్లా రాజకీయాల్లో హల్చల్ అయ్యింది. పాలేరు నుంచి టికెట్ ఆశించినా సిట్టింగ్‌కే ఇచ్చారు. పోనీ తుమ్మలను ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోలేదన్న పుకార్లు షికారు చేస్తున్నారు. దీని వెనుక మంత్రి పువ్వాడ అజయ్ ఉన్నాడని ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. మాస్ లీడర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పరిచయాలు, పలుకుబడి ఉన్న నేత కావడంతో ఇక ఈ ఎన్నికల్లో తాడోపేడో తేల్చుకోవాలని వేలాది కార్లు.. అంతకుమించి బైకులతో అభిమానులు, అనుచరులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి బలప్రదర్శన చేశారు. కచ్చితంగా ఈ ఎన్నికల్లో పోటీచేసి తీరుతానని.. హైకమాండ్ కు సవాల్ చేశారు. ఇంత జరుగుతున్నా కేసీఆర్ మాత్రం ఎందుకో అస్సలు పట్టించుకున్నట్లు అనిపించడం లేదు.

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

**ఆచితూచి అడుగులు**

2014లో తెలంగాణ వచ్చినంక రెండుసార్లు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈసారి కూడా 100 నుంచి 105 స్థానాల వరకూ గెలుస్తామని కేసీఆర్ ధీమాగా చెబుతున్నారు. ఇక మంత్రులు, ముఖ్యనేతలు సైతం ఇవే మాటలు చెప్పుకుంటూ వస్తున్నారు. ఇదే ధైర్యంతో వ్యూహాత్మకంగా అందరికంటే ముందుగా ఒకేసారి 115 మందితో కూడిన అభ్యర్థుల జాబితాను కూడా కేసీఆర్‌ప్రకటించేశారు. దీంతో ఒకటా రెండా లెక్కలేనన్ని నియోజకవర్గాల్లో అసంతృప్తులు గళం విప్పుతున్నారు. అయిననా సరే కేసీఆర్ ఎందుకో ఈసారి ఆ విషయాలపై స్పందించేందుకు ఆచితూచి అడుగులేస్తున్నారు.

**మీనమేషాలు ఎందుకు?**

బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించడానికి ఒక రోజు ముందే ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కేసీఆర్ కుటుంబ సభ్యుడు, మంత్రి హరీశ్ రావుపై ఓ రేంజ్‌లో విమర్శలు గుప్పించారు. అయినా బాస్ ఆయనను మల్కాజిగిరి అభ్యర్థిగా ప్రకటించారు. ఇంత జరిగినా సింపుల్‌గా 'మైనంపల్లి టికెట్ ఇచ్చాం.. పోటీ చేస్తారా? లేదా? అనేది ఆయన ఇష్టం' అని కేసీఆర్ అనడంపై పార్టీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. మైనంపల్లి పై చర్యలు తీసుకోవడానికి గులాబీ బాస్ ఎందుకో ధైర్యం చేయడం లేదని వారిలో అనుమానం ఇప్పటికీ పోవడం లేదు. మల్కాజిగిరి నుంచి వేరొకర్ని బరిలోకి దింపడానికి కేసీఆర్ ప్రయత్నాలు షురూ చేశారని ప్రచారం జరిగినా... అది కూడా ఇంతవరకూ కొలిక్కి రాకపోవడంతో అసలు పెద్దసారుకు ఏమైంది? అన్నట్లుగా శ్రేణుల్లో చర్చలు జరుగుతున్నాయి.

**ఇంత అన్యాయమా..?**

నమ్ముకున్న నేతలను కేసీఆర్ నట్టేట ముంచారని.. ఇంత అన్యాయమా..? అని బయటికి చెప్పుకోలేని నేతలు ఎంతో మంది పార్టీలో ఉన్నారు. రాష్ట్రం సిద్ధించి 10 ఏండ్లు అవుతున్నా ఉద్యమకారుల గురించి కేసీఆర్ పట్టించుకున్న పాపాన పోలేదు. తుమ్మల నుంచి మోత్కుపల్లి దాకా ఇదే పంథాలో కేసీఆర్ పాలన సాగుతోంది. సొంత పార్టీలోని మాజీలనూ పట్టించుకోకుండా.. ఆఖరికి జలగం వెంకట్రావు, వీరేశంలను కూడా ఎమ్మెల్సీ పదవులు ఇస్తామంటూ బుజ్జగింపులు చేస్తున్నా వారు వినే పరిస్థితులు లేవు. గత రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ ఏ ఒక్కరినీ ప్రగతి భవన్‌కు ప్రత్యేకంగా పిలిపించుకొని మాట్లాడిన దాఖలాలు లేవు. అయితే ఈ ఏడాది మాత్రం సీన్ మొత్తం మారిపోయింది. అసంతృప్తులకు తానే స్వయంగా ఫోన్ చేయడం, ప్రగతి భవన్ కు పిలిచి మాట్లాడం, మంత్రి పదవులు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు ఇస్తానని తాయిలాలు ప్రకటించడం చేస్తున్నారు. ఎన్నికలకు ఇంకాస్త సమయం ఉండగానే పరిస్థితులు ఇలా హాట్ హాట్‌గా ఉన్నాయంటే.. ముమ్ముందు ఇంకెన్ని పరిణామాలను చూడాల్సి వస్తుందో.

# తెలంగాణలో దూకుడు పెంచిన బీజేపీ

**గెలుపు గుర్రాల ఎంపిక కేంద్ర నేతలదే**

**2 ఉమ్మడి జిల్లాల చొప్పన నేతలకు బాధ్యతలు**

**ఆగస్టు చివరి రోజున వెల్లడికి ముహూర్తం**

**రెండు రోజుల పాటు**

**ఉమ్మడి జిల్లాలో పర్యటనలు, సమీక్షలు**



> “ తెలంగాణరాష్ట్రం లో భారతీయ జనతాపార్టీ దూకుడు పెంచింది. గెలుపు గుర్రాలను ఎంపిక చేసేందుకు కేంద్ర నేతలను రంగం లోకి దింపారు. ఉమ్మడి జిల్లాలో ఆ నేతలు పర్యటించి అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కార్యాచరణ సిద్దం చేశారు. ఆయా జిల్లాల్లో పర్యటించి నేతలతో సమీక్షించిన తర్వాతే అభ్యర్థుల ఎంపిక ప్రకటన పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్దం చేశారు.

**విశాల భారతి, స్టేట్ బ్యూరో :**

బీజేపీలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక మరో మూడు రోజుల్లో తేలనుంది. ఉమ్మడి జిల్లాల వారికి అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కేంద్ర నేతలే స్వయంగా దిగివచ్చి వారిని ఎంపిక చేస్తారని పార్టీ లో చర్చసాగుతోంది. అందుకు సంబంధించిన కేంద్ర నేతల వివరాలను పార్టీ ఇప్పటికే ప్రకటించింది.దీనితో కేంద్ర నేతలు ఎవ్వరిని ఎంపిక చేస్తారు అభ్యర్థుల ప్రకటన ఎలా ఉంటుందని ఆసక్తికరంగా మారింది..ఈనెల 29,30 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లో సమీక్షలు నిర్వపించాలని కేంద్ర బీజేపీ నిర్ణయం తీసుకుంది. అందుకోసం రెండు ఉమ్మడి జిల్లాలకు ఒక నేతను కేంద్రం ఉప్పటికే ప్రకటించింది. దీనితో వారి రాష్ట్రానికి రావడమే తరువాయి.కాగా రాష్ట్రానికి అమిత్ షా రావడం తో బీజేపీ లో కొత్త ఉత్సాహం నింపిందని బీజేపీ నేతలు చెప్పుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రైతు బరోసా సభ తో పార్టీ తో రైతులకు మంచి సందేశం ఇచ్చారని పార్టీ నేతలు ఆశిస్తున్నారు.దీనితో ప్రజల్లోబీజేపీ అంటే నమ్మకం పెరిగిందని చెప్పకనే చెప్పుతున్నారు.

**కేంద్రం నుండి రాష్ట్రానికి వచ్చిన నేతలు నేరుగా ప్రజల్లోకి వెల్లుతారా లేక స్థానిక నేతలతో కలిసి సమీక్షించి అభ్యర్థులను ఎంపిక చేస్తారా అన్నది తెలియాల్సి ఉంది. ప్రజల్లో ఉన్న నేతలను ఎంపిక చేస్తారా లేదా మరో నేతను ఎంపిక చేస్తారా అన్నది మాత్రం ఎన్నికల ఫలితాలు నిర్ణయించనున్నాయి.. అంతటి వరకు ఓపిగ్గా వేచిచూడాల్సిందే మరి..కేంద్ర నేతలు తీసుకునే నిర్ణయం తో రాష్ట్రం లో బీజేపీ గెలుస్తుందా లేక నిలుస్తుందా అన్నది తేలనుంది.**

ఉమ్మడి మెదక్,ఖమ్మం, కరీనంగర్, మహబూబ్ నగర్, వరంగల్ జిల్లాల్లో పర్యచింటి స్థానిక నేతలో సమీక్షించేందుకు పలువురు నేతలకు బాధ్యతలను అప్పగించారు. మెదక్, ఖమ్మం జిల్లాలకు సునీల్ బన్సల్ పూర్తి స్థాయిలో సమీక్షించాలని ఆయకు ఆదేశాలు జారీ చేశారు.కాగా కరీంనగర్, నల్గొండ జిల్లాలకు తరుణ్చగ్ పూర్తి బాధ్యతన్నారు.ఇటు మహబూబ్నగర్, వరంగల్ జిల్లాలకు ప్రకాశ్ జవదేకర్ ను చూడాల్సిందిగా కేంద్రం ఆదేశాలు ఇచ్చారు. బీజేపీ పట్టున్న ఆదిలాబాద్, నిజామాబాద్ కు అరవింద్ మీనన్ వెళ్లి సమీక్షలు నిర్వహించనున్నారు. వీరందర్ గతం లో రాష్ట్రం లో పర్యటించారు. తెలంగాణ పై అహగాహన కూడా ఉంది. ఇది ఇలా ఉంటే వారి ఎంపిక పై కేంద్రం కు ఇటు రాష్ట్ర నాయత్వం కు భారీ అంచనాలు పెట్టుకున్నట్లు సమాచారం. కాగా వారు ఈ ఎన్నికల్లో గెలుపొందు తారని ఆంచనా వేస్తున్నారు. సాధారణంగా రాష్ట్రం లో పార్టీ అధ్యక్షులు రాష్ట్ర కార్యవర్గం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేస్తారు.కానీ బీజేపీ లో మాత్రం కేంద్రం పెత్తనం సాగుతోందని తెలుస్తుంది. రాష్ట్రం లో అధికాపార్టీని ఢీ కొట్టాలంటే రాజకీయ పలుకుబడి ఉన్న నేతలను భరిలోకి దింపాలి. రాష్ట్రంలో ఏ నాయకుడు గెలువగలరు? పార్టీని ప్రజల్లో నిలబెట్టగలరు అన్న నేతకు టిక్కెట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు. కానీ కేంద్ర నేతలు రెండు రోజుల్లో రెండు ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి స్థానిక నేతలతో సమీక్షించి నిర్ణయం తీసుకుంటారా లేదా అన్నది మాత్ర కాస్త ప్రశ్నార్థకంగా మారింది. దీనితో గెలుపు గుర్రాలా లేదా అన్న ప్రశ్నగా మారే అవకాశం అధికంగా ఉనది అంచనా వేస్తున్నారు.



# పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**శాలిగౌరారం, విశాల భారతి :** గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గూనిగంగారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తాము చేపట్టిన సమ్మె 34 రోజుల అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇచ్చిన హామీ మేరకు విరమించడం జరిగిందన్నారు. సమ్మె విరమించి 20 రోజులు గడిచిన నేటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పంచాయతీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు తమ ప్రధానమైన డిమాండ్లను నెరవేర్చకపోతే మలి విడత సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చర్లపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వడ్లకొండ నగేష్, ప్రధాన కార్యదర్శి సట్టు వెంకన్న, కోశాధికారి మద్ది మల్లేష్, గౌరవాధ్యక్షుడు మందుల సాయిలు, బండి వీరయ్య,నిమ్మల నాగరాజు ,జేరిపోతుల ఉపేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాజిపల్లి పెద్దమ్మ తల్లి బోనాలు

**పాల్గొన్న నీలం మధు ముదిరాజ్**





**పటాన్‌చెరువిశాలభారతి :** జిన్నారం మండలం కాజీపల్లి శ్రీ పెద్దమ్మ దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహించిన బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు నీలం మధు ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిర్వాహకులు నీలం మధు ముదిరాజ్ కు ఘన స్వాగతం పలికారు. పెద్దమ్మ తల్లి అందరిని సుఖ సంతోషాలతో ఉండాలని మంచి నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలని కోరినట్లు ఆయన చెప్పారు. పెద్దమ్మ కృప వల్ల ఈసారి ఎన్నికల్లో తాను ప్రజల తరపున పోటీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన పలారం బండి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిట్ల సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఆంజనేయులు యాదవ్, వార్డు సభ్యులు చిరుమని సురేష్, పరివేద స్వప్న శ్రీనివాస్, పరివేద రాజు, గండి నరసింహ యాదవ్, నాయకులు శ్రీనివాస్, చంద్రయ్య, మహేష్, లక్ష్మణ్, జితెందర్, శ్రీకాంత్, శ్యామ్, వినోద్, రజినీకాంత్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.






# తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్

**పటాన్ చెరువిశాలభారతి :** శ్రావణమాసం బోనాల పండుగ సందర్భంగా రామచంద్రాపురంలోని బొంబాయి కాలనీలో గిరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన తొట్టెల ఊరేగింపు ఉత్సవంలో పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 111 డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, శాంతమ్మ, సతీష్ గౌడ్, నవీన్ గౌడ్, పీటర్, నవీన్, సామ్రాట్, సంతోష్, వినోద్, పాషా తదితరులు పాల్గొన్నారు.

**పుస్తె-మెట్టెలు అందజేసిన కాట సుధా..**

పేరంటి వివాహానికి మహిళా కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పుస్తె మెట్టులు బహుకరించారు. పటాన్ చెరు మండలం క్యాసారం గ్రామంలోని నక్క సత్య నారాయణ గౌడ్ లావణ్య దంపతుల కూతురు వివాహానికి తనవంతు సహాయంగా ఆమె పుస్తె,మెట్టెలను అందజేశారు. పెద్దింటి ఆడపిల్లలకు పెళ్లిళ్లకు ప్రతి ఒక్కరు సహకరం అందించాలని కాట సుధా కోరారు

# శభాష్ శరత్..



- **అమెరికాలో 'మెదక్ జిల్లా వాసి'కి ప్రతిష్టాత్మక పురస్కారం**
- **వాషింగ్టన్ డిసిలో అవార్డు అందుకోనున్న 'శరత్ చంద్రారెడ్డి'**

**పటాన్ చెరు(మెదక్)విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా చిన్న శంకరం పేట మండలం దరిపల్లి గ్రామానికి చెందిన సివిల్ ఇంజనీర్ వెన్నవెల్లి శరత్ చంద్రారెడ్డి అమెరికాలో ప్రతిష్టాత్మక పురస్కారం దక్కించుకున్నారు. శరత్ చంద్రారెడ్డి తండ్రి ప్రతాప్ రెడ్డి మెదక్ కోర్టులో సీనియర్ న్యాయవాది, తల్లి సబిత గృహిణి. శరత్ తాతయ్య విట్టల్ రెడ్డి గతంలో రామాయంపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా, రాష్ట్ర కోళ్లు, మాంసం అభివృద్ధి సంస్థ చైర్మన్ గా పనిచేశారు. శరత్ చంద్రారెడ్డి గత పది ఏళ్లుగా అమెరికాలో నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారు. శరత్ భారతీయ విద్యా భవన్‌లో తన ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి నుండి సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీని అభ్యసించారు. 21 సంవత్సరాల వయస్సులో అతను అమెరికాలోని హ్యూస్టన్ విశ్వవిద్యాలయంలో నిర్మాణ నిర్వహణలో మాస్టర్ ఆఫ్ సైన్స్ చదివేందుకు వెళ్ళారు.శరత్ ఆల్ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ద్వారా మంజూరైన రీసెర్చ్ ప్రమోషన్ స్కీమ్ కింద 'మాడిఫైడ్ బిటుమెన్ బైండర్స్' పనితీరు అంచనాపై పరిశోధన చేశాడు. 2014లో యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్‌లో, అతను పారిశ్రామిక వ్యయాన్ని అంచనా వేయడానికి కృత్రిమ మేధస్సును అమలు చేయడం గురించి లోతుగా పరిశోధించాడు. నిర్మాణం మరియు ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్‌లో 10 సంవత్సరాల ప్రగతిశీల అనుభవంతో, శరత్ స్ట్రీట్ రోడ్‌వే మరియు డ్రైనేజీ, హైవేలు, పార్కులు మరియు నీరు మరియు వ్యర్థ జలాలతో సహా వివిధ రవాణా మరియు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో పాలుపంచుకున్నారు. అమెరికాలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సీఎంఏఏ యంగ్ డిస్టింగ్విష్డ్ ప్రొఫెషనల్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకోవడం ద్వారా విశేషమైన ఘనత సాధించారు. కన్స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ అమెరికా ఆగస్టు 17న ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రకటించింది. శరత్ అమెరికా రాజధాని నగరం వాషింగ్టన్ డీసీలో అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ అమెరికాలో ప్రతిష్టాత్మకమైన అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. డెక్కన్ క్రానికల్ ఇంచార్జ్ జీ.సురేందర్ శరత్ చంద్రారెడ్డికు అవార్డు దక్కిన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. శరత్ చంద్రారెడ్డికు ఆయన అభినందనలు తెలిపారు.



# గర్భిణీలకు ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

**బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్ చంద్రారెడ్డి**

**బొల్లారం, మున్సిపాలిటీ విశాల భారతి:** గర్భిణీలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలో మమత హాస్పిటల్ సౌజన్యంతో బొల్లారంలోని మల్లన్న దేవాలయం సమీపంలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ సతీమణి పువ్వాడ వసంత లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెను మా అంబి సేవా సమితి సభ్యులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మమతా హాస్పిటల్ ఎండి లయన్ రాజ్ దంపతుల పెళ్లిరోజు కావడంతో ఏర్పాటు చేసినట్లు చంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వి. హనుమంత రెడ్డి, నిహారిక, గోపాలమ్మ, చంద్రయ్య, మాజీ ఎం పి టి సి రాజు, నాయకులు చక్రపాణి, రాజగోపాల్, పాస్టర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



# శరవేగంగా అమీన్ పూర్ అభివృద్ధి

**- మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి**

పటాన్ చెరు(అమీన్ పూర్)విశాలభారతి అమీన్ పూర్ మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని మల్లికార్జున నగర్, ఇక్రిసెట్ కాలనీలలో 90 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. పారదర్శకంగా అభివృద్ధి పనులు చేపడుతూ, ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. వీటితోపాటు ఆయా కాలనీలలో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, కౌన్సిలర్లు కాట సుధా, కొల్లూరి మల్లేష్, ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు యునుస్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.





# గీతంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**పటాన్‌చెరువిశాలభారతి:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం 2023ని డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ వారు ఘనంగా నిర్వహించారు. భారతీయ ఫీల్డ్ హాకీ ప్లేయర్ ధ్యాన్ చంద్ పై ఒక స్ఫూర్తిదాయకమైన చిత్రాన్ని ఈ సందర్భంగా ప్రదర్శించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ క్రీడలు, ఆటల పోటీలను నిర్వహించి, విజేతలకు ప్రశంసా పత్రాలను ప్రధానం చేశారు. బీఏ సైకాలజీ విద్యార్థిని రియా సాహంకు 2023 ఏడాదికి గాను అత్యుత్తమ క్రీడా ప్రదర్శన అవార్డును ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా గీతం కళాకృతి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులను, అలరించాయి.

**జాతీయ క్రీడా దినోత్సవం గురించి...**

మేజర్ ధ్యాన్ చంద్ శాశ్వతమైన వారసత్వానికి ఘన నివాళిగా మనదేశంలో ప్రతియేటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటారు. మనదేశంలో బలమైన క్రీడా సంస్కృతి అభివృద్ధికి ఇది ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. కేవలం పోటీ కోసమే కాకుండా సంపూర్ణ వ్యక్తిగత ఎదుగుదల కోసం వివిధ క్రీడలు, ఆటలలో చురుకుగా పాల్గొనేలా యువతను ప్రోత్సహిస్తుంది. క్రమశిక్షణ, పట్టుదల, క్రీడా స్ఫూర్తి, బృంద కృషి వంటి వాటిపై అవగాహనను పెంపొందించడమే కాక, వారి దినచర్యలో భాగంగా మార్చే లక్ష్యంతో దీనిని నిర్వహిస్తారు. అథ్లెట్ల సహకారం, సంకల్పం, వారి అసాధారణ విజయాలు, సమాజంపై దాని ప్రభావాన్ని గుర్తుచేసుకోవడానికి జాతీయ క్రీడా దినోత్సవం తోడ్పడుతుంది.

# బెల్లంపల్లి లో గడప గడపకు కాంగ్రెస్



**- 8వరోజు పాదయాత్ర లో పాల్గొన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి నాతరీ స్వామి**







**బెల్లంపల్లి,విశాలభారతి:** ఏఐసీసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ, ఎలక్షన్ కమిటీ మెంబర్ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖమ్మ ఆదేశానుసారం 8వ రోజు పల్లె పల్లెకు కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర లో భాగంగా రవీంద్ర నగర్ నుండి ఇప్పగూడెం, మోతుగూడెం, చిన్నబుధా, కాశిరెడ్డి పల్లె, బూదాకాలన్ పాదయాత్ర చేస్తూ ప్రజల అవసరాలను తెలుసుకుంటూ మోతుగూడెం గ్రామ నివాసి రామగిరి రాయమల్లు మరణించినందున ఇతని కుటుంబ సభ్యులకు నాతరీ స్వామి 5000/ ఇచ్చి ప్రగాఢ సానుభూతి తెలియపరచినారు. మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య చాలా వరకు వుందని బి.ఆర్.ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే ఇందిరమ్మ ఇళ్ళ వస్తాయని బెల్లంపల్లి నియోజకవర్గం అభివృద్ధి దిశలో ముందుకు సాగుతుందని మరి ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీ రావాలని కోరుకుంటున్నారు, కాబట్టి రాబోయేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంమే అని ఆమె పెర్కొన్నారు. రోడ్డ శారద మహిళా రాష్ట్ర కార్యదర్శి, నాతరి స్వామి నియోజకవర్గ నాయకులు, బెల్లంపల్లి మండల నాయకులు బాకం మల్లేష్, డి.సి.సి ఉపాధ్యక్షులు తొంగల మల్లేష్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు బండి ప్రభాకర్ ,మాజి ఎం.పి టి.సి బూట్ల వెంకటలక్ష్మి సీనియర్ బెల్లంపల్లి నాయకులు కంకటి శ్రీనివాస్ రోడ్డ శ్యామ్ డొలుకాసి సత్తన్న ధర్ని సత్యనారాయణ దూడం మహేష్ పి సత్యనారాయణ ఎస్ బక్కన్న గౌడ్ ఎం దశరథం డి సత్యనారాయణ గౌడ్ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కొండాపురం గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**రాయపర్తి,విశాల భారతి:.** పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై, అలాగే ప్రస్తుత బిఆర్ఎస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు విసుగుచెంది మంగళవారం తొర్రూరు లోని క్యాంపు కార్యాలయంలో రాయపర్తి మండలం కొండాపురం గ్రామానికి చెందిన సుమారు 100 మంది గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో ఝాన్సీ రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. భవిష్యత్తులో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయే అని ఈ నిరంకుశ పాలన త్వరలోనే అంతమవుతుందని వారికి ఝాన్సీ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండాపురం గ్రామం నుంచి రామగిరి వెంకటాచారి, గాదె కుమార స్వామి, వార్డ్ మెంబర్ గాదె పెంటమ్మ, మహిళా సంఘం నాయకురాలు చిన్నపల్లి పార్వతమ్మ, గాదె ఉప్పలయ్య, చిన్నపల్లి కిష్టయ్య, గాదె ఉప్పలయ్య, మేడి బిక్షం, కొండేటి బిక్షం,కొండేటి వెంకన్న, దొనగాని వెంకన్న, మేడి రాము, గాదె కుమార్,గాదె యాకయ్య, గాదె మాకాంత, గాదె లక్ష్మి, మేడి లచ్చమ్మ, గాదె ఎల్లమ్మ, కొండేటి ఎల్లమ్మ, కొండేటి ప్రమీల, కూరపాటి వెంకటమ్మ, కొండేటి వెంకటమ్మ, గాదె సుగుణమ్మ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.



# గ్రామాలకు బస్సులను పునరుద్ధరించాలి

**బీఎస్పీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి ప్రియదర్శిని**

**చిట్యాల, విశాల భారతి :** మండలంలో అన్ని రూట్లలో బస్సు సౌకర్యాలని పునరుద్ధరించాలని బీఎస్పీ నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని అన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో ప్రజలతో కలిసి ఆమె మాట్లాడారు. అనేక మంది పిల్లలు వివిధ ప్రాంతాల్లో చదువుతున్నారని గ్రామీణ విద్యార్థులకు సరైన సమయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో తరగతులకు హాజరుకాలేక పోతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో ఆటోల్లో ప్రయాణించి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయన్నారు. విధ్యా సంస్థల ప్రారంభం అనంతరం బస్సులను పునరుద్ధరించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. గ్రామాల్లో వుండే ప్రజలు చిన్న చిన్న పనులు చేసుకోవడానికి ఇతర గ్రామాలకు, మండల కేంద్రాలకు వెళ్లే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. వెంటనే అన్ని రూట్లకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని కోరారు. చిట్యాల మునుగోడు షటిల్ బస్సు నడిపితే చిట్యాల మండలం, మునుగోడు మండలంలో ఉన్న గ్రామాల్లోనీ విద్యార్థులకి, ప్రజలకి లాభం చేకూరుతుందని అన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే అభివృద్ధి కోసమే పార్టీ మారాను అని చెబుతున్న ఎమ్మెల్యే ఇక్కడి ప్రజలు, విద్యార్థుల గోస నీకు కనపడడం లేదా అని అన్నారు. ఇప్పటికైనా స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు గద్దపాటి రమేష్, మండల అధ్యక్షులు గ్యార శేఖర్, మండల అడ్వైజర్ జిట్టా నర్సింగ్ రాజ్, నాయకులు అన్నమళ్ళ సైదులు, భీంపాక సైదులు, బిఎస్పి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లిక్కర్ షాపుల్లో ఎక్సైజ్ ఆఫీసర్ల తనిఖీలు



**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల మండల లిక్కర్‌షాపుల్లో ఎక్సైజ్ ఆఫీసర్లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఎక్సైజ్ ఎస్సై పద్మ మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో ఎలాంటి మద్యం ప్రియులకి ఎలాంటి కల్తీ మద్యం జరగకుండా కల్తీ మద్యం వల్ల హానీ కలగకుండా నెల వారి తనిఖీల్లో భాగంగా ఈ రోజు దేవరుప్పులలో తనిఖీ చేశామన్నారు. తనిఖీల్లో సిబ్బంది నరేష్, పాషా, సుజాత తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ మెగా లోక్ అదాలత్ ను సక్సెస్ చేయండి

**ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్ సుందర్**

**కోదాడ, విశాల భారతి:** సెప్టెంబర్ 9న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యన్ శ్యామ్ సుందర్ పిలుపునిచ్చారు. శనివారం కోదాడ పట్టణంలోని కోర్టు హాల్లో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గాలి శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో జాతీయ లోక్ అదాలత్ కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ సివిల్ కేసులతో పాటు రాజీపడదాగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ బ్యాంక్ సంబందించిన కేసులు ఎక్కువగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించకుంటే కక్షిదారులకు సత్వర న్యాయంతో పాటు సమయం వృధా కాకుండా ఉంటుందని తెలిపారు. పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, సెకండ్ క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ, బార్ ఆసోసియేషన్ ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాస్ నాయుడు, ప్రధాన కార్యదర్శి శరత్ బాబు, తమ్మినేని హనుమంత రావు, పాషా, నాళం రాజన్న, సీతరామరాజు, సిఐలు రామకృష్ణారెడ్డి, ఎస్సైలు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



# చనిపోయిన మహిళ కుటుంబానికి ఆర్థిక సాయం

**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో హైవే రోడ్డులో బరాబర్ శోభారాణి రోడ్ క్రాస్ చేస్తుండగాటూ వీలర్ వెహికల్ ఢీకొట్టింది. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా చనిపోయింది. దీంతో భువనగిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పంజాల రామాంజనేయులు గౌడ్ శోభారాణి కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సాయం అందించి, వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీబీనగర్ యూత్ కాంగ్రెస్ నాయకులు కట్ట వినోద్. గడ్డం రాజు. దారా విజయ్. కట్ట అనిల్. కట్ట శివ యశ్వంత్ సాయి చరణ్ సందీప్ పవన్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల సమస్యలు పరిష్కరించాలి



**మునగాల, విశాల భారతి:** మండల పరిధిలోని నర్సింలగూడెం ప్రభుత్వ పాఠశాలను ఎస్ ఎస్ యూఐ మండల ఇంచార్జ్ గోగుల లక్ష్మణ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరి కూలే పరిస్థితిలో ఉన్న అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. ప్రభుత్వం పాఠశాలను మరమ్మతులు చేయించి నాణ్యమైన విద్యను అందించాలనిప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థినిలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

# శాస్త్రీయ అవగాహనతో చంద్రయాన్ స్క్రిప్ట్

**చేసి చూపిన విద్యార్థులు.**





**చిక్కడపల్లి,విశాల భారతి:** సామాజిక మధ్యమాలు విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న తరుణంలో కొందరు వీటివల్ల సమాజం లో చెడు అలవాట్లు నేర్చుకుంటున్నారని బాధ పడుతుంటే మాధ్యమాలతో పిల్లలు యువత శాస్త్రీయ సాంకేతిక రంగాలపై అవగాహన బాగా పెరిగిందని న్యూ చైతన్య కళాశాల యువతీ యువకులు నిరూపించారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభ లో జల్సా 2023 పేరిట జూనియర్ ఇంటర్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఇటీవల ఇస్రో చంద్రుని పైకి ఉపగ్రహాన్ని పంపిన అంశం పై చంద్రయాన్ పేరిట విద్యార్థులు ప్రదర్శించిన స్క్రిప్ట్ వారిలో వున్న శాస్త్రీయ అవగాహన తో పాటు నట ప్రతిభ కు అద్దం పట్టింది. పలు హిందీ తెలుగు పాటలకు హుషారుగా యువతులు నర్తించి యువకులతో పోటీ పడ్డారు. న్యూ చైతన్య కళాశాల చైర్మన్ ఉదయ భాస్కర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తమ కళాశాల విద్యతో పాటు క్రీడా కళలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు.విద్యార్థుల మానసిక వికాసానికి ఇవి దోహద పడతాయని ప్రతి విద్యార్థి తన లోని సృజనాత్మక ను వెలుగులోకి తేవాలని ఇందుకు కళాశాల యాజమాన్యం అధ్యాపక వర్గం సహకరిస్తుందని తెలిపారు డైరెక్టర్ ప్రదీప్, అకాడమిక్ డైరెక్టర్ శ్రీదేవి, ప్రిన్సిపల్స్ వెంకటేష్ పల్లవి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# మణుగూరులో బీఆర్ఎస్ లీడర్ల పాదయాత్ర

- భద్రాద్రి రామయ్య ఆలయం వరకు సాగనున్న యాత్ర
- పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

**మణుగూరు, విశాల భారతి :** సీఎం కేసీఆర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు గెలుపు కోరుతూ మంగళవారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి బీఅర్ ఎస్ నాయకులు వేర్పుల సురేష్, గంగారపు రమేష్, యాకయ్య, నాగేల్లి గోపి , యాట సుధాకర్,వేర్పుల జీవన్, బేత మళ్ల సుందర్, గారా విష్ణు, దామర్ల దయాకర్, పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ప్రారంభించి యాత్రలో పాల్గొన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మూడోసారి కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ గెలిచి అధికారం చేపట్టాలని రేగా కాంతారావు ఎమ్మెల్యే గా మూడోసారి విజయఢంకా మోగించి పినపాక గడ్డ పై గులాబీ జెండా ఎగరేయ్యాలని, భద్రాచలం శ్రీ రామచంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. బీ అర్ ఎస్ గెలుపు కోసం తామంతా అండగా నిలిచి ప్రభుత్వ పథకాలు గడప గడపకు తీసుకువెళ్ళి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా అధికారం లోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. అదే విధంగా రేగా కాంతారావు మూడోసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలవాలని పాదయాత్రలో నినాదాలు చేశారు. ఈ యాత్ర 100 పడకల ఆసుపత్రి వరకు చేపట్టగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు కూడా వారితో పాదయాత్రలో నడిచారు. అక్కడి నుంచి నాయకులు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి చేరుకుని అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం లోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు యువజన విభాగం నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# రైతులకు అండగా బీఎస్పీ

**రాపోలు నవీన్ కుమార్**

**గరిడేపల్లి, విశాల భారతి :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల పంట రుణాలను మాఫీ చేసినట్టు ప్రకటించినప్పటికీ బ్యాంకు ఆఫీసర్లు, వడ్డీ కిందనే జమ చేసుకొని డబ్బు తిరిగి ఇవ్వకపోవడం సరికాదని బీఎస్పీ సూర్యాపేట జిల్లా ఇంచార్జి రాపోలు నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం నేరేడుచర్ల కేంద్రంలో బీఎస్పీ పట్టణాధ్యక్షుడు కర్రీ సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వము 2014 నుండి 18 సంవత్సరం లోపల అప్పు తీసుకున్న వారికి రుణమాఫీ ప్రకటించినది కానీ, 2014 నుంచి తీసుకున్న అప్పు వడ్డీ కింద సంవత్సరానికి ఒకసారి రెన్యువల్ చేసుకొని అప్పు ఇచ్చి మళ్లీ వాల్లె జమ చేసుకున్న పరిస్థితి, నేడు ప్రభుత్వం లక్ష రూపాయలు మాఫీ ప్రకటించిన తర్వాత మళ్లీ కొత్త రుణాలు తీసుకోమని ప్రభుత్వం సందేశం ఇచ్చినా కానీ బ్యాంకు వారు కొత్త పంట రుణాలు ఇవ్వని పరిస్థితి అనేక కొర్రీలు పెట్టి మీరు రెగ్యులర్ గా వడ్డీ కట్టలేదని మీకు మీకు ఎకరానికొక్కంటికీ 70,000 ఇవ్వమని ఏదో 25,000 నుండి 30000 ఇస్తామని బ్యాంకు వారు అనేక కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారు ఇట్టి విషయాన్ని ప్రభుత్వం, బ్యాంక్ వాళ్ళు పరిశీలించి రైతులకు వెంటనే కొత్త రుణాలు ఇచ్చేటట్టుగా చర్యలు తీసుకోవాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు జీలకర రామస్వామి, మండల అధ్యక్షులు తకెళ్ళ నాగార్జున కొంతమంది రైతులు పాల్గొన్నారు.

# ఎస్సి, ఎస్టీ యువత గొప్ప పారిశ్రామిక వెతలుగా ఎదగాలి



**నల్గొండ,విశాలభారతి:** దళిత బంధు లబ్దిదారులు గొప్ప పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని షెడ్యూల్డ్ కులాల అధికారి శ్రీనివాసు అన్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మనేజర్ కోటేశ్వర్ మాట్లాడుతూ యువత ఉపాధి కల్పించ విధంగా వ్యాపారాలు విస్తృత స్థాయిలో ఏర్పాటు చేయాలని, సంస్థ నుంచి తప్పకుండా సహాయం అందిస్తామని తెలిపారు. స్థానిక టీఎన్జీవో భవన్ లో దళత బంధు డిక్కీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ గోళ్ళబోయిన అంబేద్కర్ అధ్వర్యంలో మంగళవారం టీ ఇగ్నైట్ ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎస్సి,ఎస్టీ యువతకు నిర్వహించిన అవగాహన సదస్సులో డిఆర్ డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ కాలిందిని ఐడి ఎం శ్రామిక,నాబార్డ్ మేనేజర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు .జిల్లాలో 521 మందికి పైగా దళిత బంధు పథకం ద్వారా లబ్ది పొందిన వారున్నారన్నారు.డైరీ, సెంట్రిన్గ్,పోటో స్టూడియో ,కిరణం,లైటింగ్ తదితర యూనిట్లు లబ్దిదారులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా డిక్కీ మార్గదర్శనం చేయాలన్నారు.డిక్కీ రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి అరుణ మాట్లాడుతూ ఎస్సి,ఎస్టీ యువతకు సెప్టెంబర్ రెండవ వారంలో హైదరాబాద్ లో 21 రోజుల పాటు మరో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు .ఎన్జీఓ నాయకులు శ్రవణ్ డిక్కీ ప్రతినిధులు దాసరి నారాయణ, రాజేష్, అరుణ్ పాల్గొన్నారు.



# దివ్యాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలి

**డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డేఫ్.**

**ముషీరాబాద్,విశాల భారతి:** దివ్యాంగులకు ఎలాంటి ఆదరణ లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డేఫ్ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను దృష్టిలో ఉంచుకొని బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేసి దివ్యంగులకు అండగా నిలవాలని కోరింది. మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద డెఫ్ ప్రతినిధులు దివ్యాంగుల సమస్యలు డిమాండ్ల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం డేఫ్ అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమనేని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా రాష్ట్రస్థాయి కమిషన్ ఏర్పాటు చేసి దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు దివ్యాంగుల బంధు పథకం ప్రవేశపెట్టాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఆసరా పథకం కింద పెన్షన్లు 10000 రూపాయలు ఇవ్వాలని కోరారు. చీఫ్ సెక్రటరీ శాంత కుమారుని కలిసి మా సమస్యలు వివరించాలని సెక్రటేరియట్ కు ఈనెల 21న వెళ్తే అక్రమంగా అరెస్టు చేసి గోషామాల్ పోలీస్ స్టేషన్ తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సమయం ఇవ్వడం లేదని సిఎస్కో మా సమస్యలు తెలపాలనే ఉద్దేశంతో మెయిల్ ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో వచ్చే నెలలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో నిరసన దీక్ష చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్, నవాజ్ ఖాన్, గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# టర్ బోర్డులో సింగిల్ ఏజెన్సీ విధానాన్ని అమలు చేయాలి..

**హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స సేవరేజ్ బోర్డు కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ అసోసియేషన్ డిమాండ్..**

**ముషీరాబాద్,విశాల భారతి:** వాటర్ బోర్డులో సింగిల్ ఏజెన్సీ విధానాన్ని అమలు చేసి మీటర్ రీడర్స్ కు న్యాయం చేయాలని హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స సేవరేజ్ బోర్డు కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పి. నారాయణ, వాటర్ బోర్డు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి రాంబాబు యాదవ్ హాజరై మాట్లాడారు. వాటర్ బోర్డులో ప్రస్తుతం 12 ఏజెన్సీలతో నడుస్తున్న మీటర్ రీడర్స్ అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏజెన్సీ నిర్వాహకులు సరైన సమయంలో జీతాలు చెల్లించడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి సింగల్ ఏజెన్సీ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అలానే వాటర్ బోర్డులో 14, 60 జీవోల ప్రకారం ఉద్యోగ భద్రత పిఆర్సి వేతన సవరణ చేయాలన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు కిరణ్, బాలకృష్ణారెడ్డి సందీప్ రెడ్డి శ్రీరామ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# కీలక రంగంగా ఆవిర్భవించిన డేటా సైన్స్ కోర్సులు

- ఆర్ బివిఆర్ఆర్ కళాశాలలో డేటా సైన్స్ కోర్సులు
- డేటా సెన్స్ కోర్సులకు పెరుగుతున్న ఆదరణ
- డేటా సైన్స్ కోర్సుల ఆవశ్యకతపై ప్రొఫెసర్ వంశీ మోహన విశ్లేషణ...




**హైదరాబాద్ విశాలభారతి :** పోటీ ప్రపంచంలో డేటా సైన్స్ కోర్సులకు ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రోత్సాహకరమైన అవకాశాలను అన్వేషించడం తెలంగాణ, భారతదేశంలోని విద్యార్థుల కోసం డేటా సైన్స్ కోర్సులని ఆర్ బివిఆర్ఆర్ కళాశాలలో ప్రవేశపెట్టింది. మహిళ కళాశాల ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా భవిష్యత్తులోకి దూసుకెళ్లింది. 2019 విద్యా సంవత్సరంలో డేటా సైన్స్ ప్రోగ్రామ్, జంట నగరాల్లో ఇటువంటి కోర్సును అందించే మొదటి సంస్థగా (ఆర్ బివిఆర్ ఆర్) పరిణామాల కు అగ్రగామిగా నిలిచింది. వివిధ పరిశ్రమలలో నైపుణ్యం కలిగిన డేటా శాస్త్రవేత్తల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు ప్రతిస్పందనగా ఈ పరిణామం అత్యంత ఆవశ్యకం సంక్లిష్ట డేటా సెట్‌లను విశ్లేషించడం మరియు వివరించడం వంటి నిర్ణయాలు తీసుకోవడం కోసం ప్రత్యేకంగా ఈ డేటా సైన్స్ ప్రపంచ వ్యాప్తంగా కీలకమైన రంగంగా ఆవిర్భవించింది. డేటా యొక్క ఘననీయమైన పెరుగుదలతో, కంపెనీలకు ఈ విస్తారమైన సమాచారాన్ని అర్థం చేసుకోగల మరియు విలువైన సమగ్ర కోణాలలో విశ్లేషించగల నిపుణుల అవసరం ఉంది. ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సు విద్యార్థులకు డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్ మరియు స్టాటిస్టికల్ టెక్నిక్‌లపై సమగ్ర అవగాహన కలిగిస్తుంది. ఈ ప్రోగ్రామ్ నుండి గ్రాడ్యుయేట్‌లు విభిన్న రంగాలలోని అనేక అవకాశాల ను పొందేందుకు బాగా సిద్ధమయ్యారు. ఫైనాన్స్ నుండి హెల్త్‌కేర్ వరకు, ఇకామర్స్ నుండి వినోదం వరకు, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగు పరచడానికి మరియు ఆవిష్కరణలను నడపడానికి డేటా శాస్త్రవేత్తలు అన్వేషిస్తున్నారు. పరిశ్రమలు డిజిటలైజ్ చేయడం మరియు డేటా ఆధారిత వ్యూహాలపై ఎక్కువగా ఆధారపడటం కొనసాగిస్తున్నందున, నైపుణ్యం కలిగిన డేటా శాస్త్రవేత్తల కోసం డిమాండ్ పెరుగుతుందని అంచనా వేయబడింది. ఆర్ బివిఆర్ఆర్ మహిళా కళాశాల యొక్క డేటా సైన్స్ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులు పోటీతత్వంతో ఈ నిత్య నూతన మైన ఈ రంగంలోకి ప్రవేశించడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ కోర్సును అందించడం ద్వారా,కళాశాల విద్యార్థుల కెరీర్ విజయానికి మార్గం సుగమం చేయడమే కాకుండా భారతదేశంలో డేటా సైన్స్ నైపుణ్యాల లోటును పూరించడానికి కూడా దోహదపడుతుంది.



**టి. వంశీ మోహన**
అసోసియేట్ ప్రొఫెసర్
హెడ్, కంప్యూటర్ సైన్స్ విభాగం
ఆర్ బివిఆర్ఆర్, మహిళా కళాశాల,
నారాయణగూడ, హైదరాబాద్



## నవజాత శిశువుల సంరక్షణకు ప్రభుత్వం కృషి

**అత్యాధునిక హంగులతో నూతన అంబులెన్స్ సర్వీస్ ను ప్రారంభించిన గాంధీ**

**శేరిలింగంపల్లి విశాల భారతి:** నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణకై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. అందులో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన అంబులెన్సు(108) సర్వీస్ లో భాగంగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా వైద్యాధికారి వేంకటేశ్వర రావు, డిప్యూటీ డిఎంహెచ్వో సృజనలతో కలిసి మంగళవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, పెద్ద మనసుతో నవజాత శిశువుల (పుట్టినప్పటి నుండి 40 రోజుల) సంరక్షణకై అత్యవసర చికిత్స కై అత్యాధునిక వసతులతో, మెరుగైన సౌకర్యాలతో, ఆక్సిజన్, ఇంక్యుబేటర్ తో కూడిన అంబులెన్స్ సర్వీస్ లు ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు. నేటి నుండి ఈ అంబులెన్స్ ఉచిత సేవలు అందుబాటులో కి వస్తాయని, మన ప్రాంత పేద ప్రజలకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మూర్తి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు .



## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**శేరిలింగంపల్లి విశాల భారతి:** గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడ, సఫారీనగర్ లో న్యూబ్లూమ్ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ "గిడుగు రామమూర్తి వంటి మహనీయులు తెలుగువారు కావడం తెలుగుజాతికి గర్వకారణమని, వారి చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. తెలుగు వాడుక భాషా ఉద్యమానికి పితామహుడని, వారి ఉద్యమ ఫలితంగానే మనం ఈనాడు వాడుక భాషలో విద్యను అభ్యసించ గలుగుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాదు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి ప్రసంగిస్తూ 'కళాప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు సమాజం తెలుగుభాషా దినోత్సవాన్ని జరుపుకోవటం ఆనవాయితని గిడుగు రామమూర్తి పంతులు తమ జీవితకాలంలో సగం రోజులు తెలుగు వాడుక భాషను గౌరవించాల్సిన అవసరాన్ని చారిత్రక, సాంఘిక కోణాలలో పరిశీలించి వివరించారని పేర్కొన్నారు. మారుతున్న సమాజానికి అవసరమైన భావజాలాన్ని సమకూర్చుకోవటానికి ఆధునిక వ్యావహారిక భాషను ప్రమాణీకరించుకుంటూ ముందుకు పోవాలన్న సూచనలు ఎన్నో చేశారని గుర్తు చేశారు. అందుకనే ఆయన ఆంగ్లేయులు అమలుపరచిన విద్యావిధానంలో గ్రాంథిక భాష కన్నా వాడుక భాష అవసరం ఎక్కువ అని గుర్తించారు. తెలుగు భాష ఉద్యమానికి 1907వ సంవత్సరము పునాది అయితే, ఆయన తుది శ్వాస 1940 వరకు నిర్విరామంగా 33 సంవత్సరాల పాటుగా వ్యావహారిక భాషావాదం కోసం తన జీవితాన్ని, ఆరోగ్యాన్ని పణంగా పెట్టారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆడబిడ్డలకు అండగా ఉంటా

**ఆర్మూర్, విశాల భారతి:** ఆర్మూర్ ఎమ్మెల్యే , పియుసి చైర్మన్ భారత రాష్ట్ర సమితి నిజామాబాద్ పార్టీ అధ్యక్షులు ఆశన్న జీవన్ రెడ్డి మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొని బిజీ బిజీగా గడిపారు. ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని గంగారమంద, గుత్ప,చిక్లి, షాపూర్, మచ్చర్ల ,మిర్ధ పల్లి గ్రామాలకు చెందిన యువకులు, మహిళలు ఎమ్మెల్యే సమక్షంలో అంకాపూర్ లోని ఆయన నివాసంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నందిపేట్ మండలంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ పద్మశాలి సంఘం, గౌడ ఫంక్షన్ హాల్ సందర్శించి జరుగుతున్న నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

**రాఖీలు కట్టి అభిమానాన్ని చాటుకున్న మహిళలు**

మహిళలు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. ఐకెపి, మోప్మాలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ల కు చెందిన మహిళలు పెద్ద ఎత్తున రాఖీ కట్టడానికి వచ్చారు. మహిళా సోదరీమణులకు ఎమ్మెల్యే దంపతులు చిరు కానుకగా చీరేలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆశన్న జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి బాటలో ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పండిత్ వినీత పవన్, రైతు నాయకులు కోటపాటి నరసింహా నాయుడు మాయాపూర్ సర్పంచ్ మెరుగు అనురాధ సుభాష్ గౌడ్ , మాయాపూర్ మహిళా సంఘాల సభ్యులు ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ ఫంక్షన్ హాల్ పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే**

మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్న జీవన్ రెడ్డి ఎస్సీ ఫంక్షన్ హాల్ వద్ద జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. ఫంక్షనల్ పనులను మరింత వేగవంతం చేయాలని నాయకులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఫంక్షనల్ చైర్మన్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెల్మల్ రాజన్న, ఎర్రటి మోహన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పొగరి సంజీవ్,శ్రీధర్, జీవన్,ప్రశాంత్, రవి,మురళి, శుభాకార్ వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు,ఉప సర్పంచ్ లు ఎంపీటీసీ లు తదితరులు ఉన్నారు



## ఆలయ నిర్మాణకర్తకు ఘనంగా సన్మానం

**నూతనకల్, విశాల భారతి :** మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో ఇటీవల నిర్మించిన గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి ఆలయం, విగ్రహాల ప్రతిష్ఠాపనకు సహకరించి రూ. 50 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణం చేసి పండుగను సక్సెస్‌చేసిన నిర్మాణ కర్త ఏనుగుతల వసంత చంద్రయ్య దంపతులను ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామం మీద మక్కువతో గ్రామ దేవత ఆలయ నిర్మాణానికి నడుం బిగించి ఆలయాన్ని వైభవోపేతంగా ఏర్పాటు చేసిన దాతకు కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం సత్యనారాయణ, ఎంపీటీసీ రజిత లింగరాజు, ఉప సర్పంచ్ ఇరుగు లక్ష్మమ్మ వీరస్వామి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి..

**బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి..**



**బోడుప్పల్, విశాల భారతి:** పేద ప్రజలకు అవసరమైన వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. 26వ డివిజన్ వీరారెడ్డి నగర్ కాలనీకి చెందిన దత్తత్రి అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకోవడం జరిగిందని.. శస్త్రచికిత్స వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు రావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా సీఎంఆర్ఎఫ్ నుండి రూ.60,000, 7వ డివిజన్ ఆంజనేయ నగర్ కాలనీ వాసి ఎం శైలజకు రూ .60,000 చెక్కును కుటుంబ సభ్యులకు మంద సంజీవరెడ్డి అందచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, 26 డివిజన్ ఇంచార్జ్ రాసాల మహేష్ యాదవ్ ఉప్పరి విజయ్ వీరారెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు కాలనీ వాసులుపాల్గొన్నారు.



## గాంధీని సన్మానించిన అంజయ్య నగర్ సగర సంఘం

**శేరిలింగంపల్లి విశాల భారతి:** రాబోయే ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు గాంధీకేనని అంజయ్య నగర్ సగర సంఘం నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, అంజయ్య అధ్యక్షుడు నరసింహ సాగర్ ఆధ్వర్యంలో కలిసి వెళ్లి తమ మద్దతును తెలియజేస్తూ ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మొదటి లిస్టులోనే ఎమ్మెల్యే గాంధీ పేరును ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే గాంధీని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం నాయకులు, కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నాం

**ప్రభుత్వ విప్ గాంధీ**

**శేరిలింగంపల్లి విశాల భారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వ విప్, శేరలింగంపల్లి శాసనసభ్యులు హరికెపూడి గాంధీ అన్నారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్లోని పలు ప్రాంతాల్లో రూ. కోటి 50 లక్షల అంచన వ్యయంతో చేపట్టబోయే ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపనపల్లి వీకర్ సెక్షన్ కాలనీ, ఖాజాగూడ వికర్ సెక్షన్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు ఎమ్మెల్యే ప్రత్యేక నిధుల ద్వారా మంజూరైన రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఈఆర్ఐసి ఏఈ చందు, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు రాజు నాయక్, చిన్నం రాజు ముదిరాజ్,సురేష్ గౌడ్,మంత్రి ప్రగాఢ సత్యనారాయణ, జంగయ్య యాదవ్,సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధిలో కల్వకుర్తి నియోజకవర్గం ముందంజ

**ఆమనగల్లు, విశాల భారతి :** కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని ఎమ్మెల్యే జయపాల్ యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు అభివృద్ధిని స్వాగతిస్తూ మరొకసారి గులాబీ జెండా ఎగరవేయుటకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మంగళవారం ఆమనగల్లు మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. రూ.8.5 కోట్లతో నిర్మించే పలు బీటీ రోడ్లకు భూమి పూజ చేశారు. అనంతరం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని పూసల సంఘము, యాదవ సంఘము, గౌడ సంఘము భవనాలకు భూమి పూజ నిర్వహించి భవన నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత బీటీ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత కల్పించినట్లు, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పల్లెకు అద్దంలాంటి రోడ్లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్, జడ్పిటిసి అనురాధ, మున్సిపల్ చైర్మన్ రాంపాల్,వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు పాల్గొన్నారు



## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**ఆమనగల్లు, విశాల భారతి :** మున్సిపాలిటీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆమనగల్లు మున్సిపల్ సిబ్బంది ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఉద్యోగులను వెంటనే అవుట్ సోర్సింగ్ నుండి పర్మినెంట్ చేసి కనీస వేతనాలను పెంచాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్, కమిషనర్ శ్యాంసుందర్ లకు వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మున్సిపాలిటీ కి సంబంధించిన ఔట్సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎబివిపి ఆధ్వర్యంలో రక్షా బంధన్

**ఆమనగల్లు, విశాల భారతి :** మహిళల పట్ల ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని ఎబివిపి జిల్లా నాయకులు బోల్గం మురళి అన్నారు. మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కడ్తాల్ శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతు రాఖీ బంధన్ అనేది సోదరభావాన్ని పెంపొందిస్తుందన్నారు. తోటి మహిళలపై ప్రేమాభిమానులు చూపిస్తూ సోదరిభావం కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థినిలు రాఖీలు కట్టి సోదర భావాన్ని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి నేనావత్ శ్రీకాంత్, ఏబీవీపీ నాయకులు, సందీప్, శ్రీకాంత్, శ్రీవాణి పాల్గొన్నారు.

# ఆర్మూర్ నియోజకవర్గంలో ప్రారంభమైన ఎన్నికల సందడి



**ఆర్మూర్, విశాల భారతి:** ఆర్మూర్ నియోజకవర్గంలో ఎన్నికల సందడి హీటెక్కిస్తోంది. అధికార పార్టీకి చెందిన ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ కావడంతో బి.ఆర్.ఎస్ కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో ప్రజా ఆశీర్వాద యాత్రలను కొనసాగిస్తున్నారు. కొన్ని గ్రామాలలో ప్రచార రథం తిరగడంతో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గంలో మంచి ఊపు మీద ఉంది. ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ విజయం అందించాలని ఇప్పటినుండి వ్యూహాలను రచిస్తున్నట్లు సమాచారం. ఆర్మూర్ నియోజకవర్గాన్ని రెండు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం, చేసిన అభివృద్ధి జీవన్ రెడ్డి మూడోసారి విజయానికి దోహదం చేస్తాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే నిరంతరం అన్నదాన కార్యక్రమాలు సిద్దిలగుట్ట పైన నిర్వహిస్తున్నారు, ఎమ్మెల్యేను కలుసుకోవడానికి నియోజకవర్గాల నుండి ఎవరైనా వెళ్తే వారికి టిఫిన్ భోజనం పెట్టి పంపిస్తారు ఏ కార్యక్రమం చేసిన అన్నదానం నిర్వహిస్తుంటారు.

**కనిపించని ప్రతిపక్షాలు**

నియోజకవర్గంలో ఉనికి చాటేందుకు ప్రతిపక్ష పార్టీలు చూస్తున్నాయి. కాంగ్రెస్, బిజెపి, బీఎస్పీ పార్టీలు ప్రచారంలో కనిపించే పరిస్థితి లేదు. కాంగ్రెస్ బిజెపి ప్రధాన పార్టీల అభ్యర్థులను ఇప్పటివరకు ఖరారు కాకపోవడంతో ఆర్మూర్ నియోజకవర్గంలో ఎవరు పోటీ చేస్తారని ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ నుండి వినయ్ రెడ్డి బిజెపి నుండి రాకేష్ రెడ్డి పోటీ చేస్తారని ప్రజలు అనుకుంటున్నారు.

# కాంగ్రెస్, బీజేపీ వల్లే దేశం అధోగతి

- సంక్షేమం పట్టించుకోలే
- కేసీఆర్ సీఎం అయ్యాకే తెలంగాణ సస్యశ్యామలం
- తొర్రూరులో.. దేశంలోనే అతి పెద్ద పామాయిల్ ప్రాజెక్ట్
- రూ.175 కోట్లతో 82 ఎకరాల్లో గోపాలగిరిలో ఏర్పాటు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు




**మహబూబాబాద్ / తొర్రూర్, విశాల భారతి :** కాంగ్రెస్, బీజేపీల వల్లే దేశం, రాష్ట్రం అధోగతి పాలయ్యాయని, ఆ రెండు పార్టీలకు అధికార యావే తప్ప... ప్రజలు, వారి అభివృద్ధి, సంక్షేమాలను ఏనాడూ పట్టించుకోలేదని పంచాయతీరాజ్ శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్‌మండలం గోపాలగిరిలో పామాయిల్ క్షేత్రానికి శంకుస్థాపన, కార్యాలయ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పోలేపల్లిలో 33/11 కేవీ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోపాలగిరి పామాయిల్ ప్రాజెక్టు స్థలంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడారు. కేసీఆర్ సీఎం అయ్యాకే తెలంగాణ సస్యశ్యామలం అయిందన్నారు. 'గత పాలకులు కాలువలు తవ్వి వదిలేస్తే కేసీఆర్ ప్రాజెక్టులు పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగు, తాగునీరు అందిస్తున్నారన్నారు. ఇలాంటి ప్రజాసంక్షేమ ప్రభుత్వం గతంలో లేదు. భవిష్యత్ లో రాదని ఎర్రబెల్లి అన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఆయిల్ పామ్ సాగులో దేశంలో రెండో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు కేవలం 33,681 ఎకరాల్లో మాత్రమే సాగు అయ్యింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినంక ఆయిల్ పామ్ సాగును ప్రతిష్టాత్మకంగా చేపట్టి 1.54 లక్షల ఎకరాల విస్తీర్ణానికి పెంచామన్నారు. 2022- 23 లో రికార్డు స్థాయిలో 22,246 మంది రైతులు 82,372 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశారన్నారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు ఈ ఏడాది 2,30,000 ఎకరాల లక్ష్యం కేటాయించగా.. ఇప్పటి వరకు 43 వేల ఎకరాల్లో శాంక్షన్‌చేసి, 28 వేల ఎకరాలలో మొక్కలు నాటామన్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 6,435 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశామన్నారు. రెండేండ్ల కింద హరిపిరాల గ్రామం, తొర్రూరు మండలంలో ఆయిల్ పామ్ నర్సరీ 45 ఎకరాలలో ఏర్పాటు చేశామన్నారు. ఆయిల్‌పామ్‌ఒకసారి వేసుకుంటే నాలుగేళ్ల నుంచి 25 ఏండ్ల వరకు రైతుకు స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు. ఈ పంటకు తక్కువ పెట్టుబడి, దీర్ఘకాలికంగా గరిష్టంగా 25 నుంచి 30 ఏండ్ల దాకా పంట దిగుబడి వస్తుందన్నారు.

**దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టు**

దేశంలోనే అతి పెద్ద పామాయిల్ ప్రాజెక్టును గోపాలగిరిలో 82 ఎకరాల్లో రూ.175 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామని మంత్రి అన్నారు. ఇందులో 300 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ ఆయిల్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో 30 టన్నుల నుంచి 60 టన్నుల సామర్థ్యంతో పామాయిల్ ఫ్యాక్టరీ పని చేస్తుందన్నారు. గంటకు 60 టన్నుల ఆయిల్ ఫామ్ గెలలను మిల్లింగ్ చేసే సామర్థ్యం గల ఈ ఫ్యాక్టరీ దేశంలోనే అతిపెద్దది అని చెప్పారు. ఈ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వల్ల పామాయిల్ సాగు విస్తీర్ణం పెరగడమే కాక ఫ్యాక్టరీ రైతులకు అందుబాటులో ఉంటుందని మంత్రి వివరించారు.

**కేసీఆర్‌ఫొటోకు క్షీరాభిషేకం**

సాంస్కృతిక సారథి కళాకారులకు పీఆర్సీ వర్తింప చేయడంతో అందుకు సంతోషంగా కృతజ్ఞతగా మంత్రి దయాకర్ రావు ఆధ్వర్యంలో సంబంధిత కళాకారులు ఇదే వేదికపై సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, కలెక్టర్ శశాంక, ఎండీ సురేందర్, సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాబు మోహన్ మల్లేష్.

# గాంధీని భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం

**బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాబు మోహన్ మల్లేష్**

**శేరిలింగంపల్లి విశాల భారతి:** సీఎం కేసీఆర్ ఎన్నికల జాబితాలో ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ పేరును మొదటి లిస్టులోనే ప్రకటించడంతో హఫీజ్ పేట్ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బాబు మోహన్ మల్లేష్ హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లేలా కృషి చేస్తున్న నాయకులు గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం భవిష్యత్తులో మరింత అభివృద్ధి జరగాలంటే కేవలం గాంధీకే సాధ్యమని, గడిచిన 9 ఏళ్ల కాలంలో నియోజకవర్గాన్ని వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఆయనను మరో మారు ఎమ్మెల్యేగా గెలుపించుకోవాల్సిన అవసరం నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు. ముచ్చటగా మూడోసారి గాంధీని లక్ష పై చిలుకు మెజారిటీతో గెలిపించుకొని ముఖ్యమంత్రి కెసిఆర్ కు కానుకగా ఇద్దామని నాయకులు,కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.




# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**చిట్యాల, విశాల భారతి :** చిట్యాల పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. అదే విధంగా గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు చేసిన కృషి గుర్తించి అతని జయంతి సందర్భంగా నిర్వహించే తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని , క్రీడల వల్ల ఎన్నో అవకాశాలు వస్తాయని ఈ అవకాశాలను భవిష్యత్తు లో ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అలాగే తెలుగు భాషా దినోత్సవం ప్రాముఖ్యతను తెలిపి, రెండు వేడుకలు ఒకే రోజు జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. విద్యార్థిని విద్యార్థులకు జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి, పాఠశాల ఏవో పోలా గోవర్ధన్, పీఈటీ గంగపురం రాము టీచర్లు పాల్గొన్నారు.

# భువనగిరి ఎమ్మెల్యేనుకలిసిన గౌడ సంఘం లీడర్లు



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** భువనగిరి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్న భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి కి మూడోసారి భువనగిరి అభ్యర్థి గా రావడం పట్ల మంగళవారం వలిగొండ గౌడ సంఘం తరఫున ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వలిగొండ ఎంపీటీసీ పల్సం రమేష్ గౌడ్, పబ్బు స్వామి గౌడ్. కొండూరు అంజయ్య, బత్తిని దేవేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసుల మధుసూదన్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ పబ్బు వెంకటరమణ , మునుకుంట్ల ధనుంజయ, పబ్బు శ్రీరాములు, కుంభం మల్లేష్, బత్తిని అయోధ్య, కొండూరు బాలరాజు, పబ్బు శెట్టయ్య, కొండూరు భాస్కర్, మునుకుంట్ల బిక్షపతి, మారగోని నర్సింహా,మారగోని బిక్షపతి కాసుల వెంకన్న పల్సం భాను రాగిరు నరసింహ గౌడ తదితరులు పాల్గొన్నారు.

# ఆప్‌రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడిగా పురుషోత్తం రెడ్డి




**శాలిగౌరారం, విశాల భారతి:** ఊట్కూరు గ్రామానికి చెందిన యంపల్ల పురుషోత్తం రెడ్డి ని ఆమ్‌ఆద్మీ పార్టీ రైతు సంఘం అధ్యక్షుడి గా నియమిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిద్ది సుధాకర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా నియామక పత్రాన్ని పార్టీ కోర్ కమిటీ మెంబర్ టి. తిరుమలరావు మంగళవారం పురుషోత్తం రెడ్డి కి అందజేశారు. ఈ సందర్భంగా యంపల్ల పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల సాధన కై కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# జాతీయోద్యమం వల్లనే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ భావనలు



**శేరిలింగంపల్లి విశాల భారతి:** భారత జాతీయోద్యమ సాహిత్యాన్ని స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత వచ్చిన సాహిత్యంగా విభజించుకోవచ్చునని.. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి నూతన భావనలతో పాటు భౌగోళిక ప్రాంతాల సరిహద్దులు లేని విశ్వైకభావన వంటి భావనలు, జాతీయోద్యమ సాహిత్యం వల్ల ఏర్పడ్డాయని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు తెలిపారు. సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ భాషా, సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం పాత్ర అనే అంశంపై రవీంద్ర భారతి మినీహాల్, హైదరాబాద్ లో జరుగుతున్న రెండు రోజుల సదస్సులో మంగళవారం తొలి సమావేశంలో హెచ్ సియు, తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. 'జాతీయోద్యమ సాహిత్యం కొత్త భావనలు' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయోద్యమ ప్రభావం వల్ల ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్న కొత్త భావనలను నాలుగు విధాలుగా వర్గీకరించుకోవచ్చని ఆవాటిని విశ్లేషించారు. రాచరికం, నిరంకుశ, విధానాలు చవిచూసిన ప్రజలు యూరప్ లో వచ్చిన అనేక పురాణాలు, ముఖ్యంగా ఫ్రెంచ్ విప్లవం వల్ల స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి కొత్త భావనలు జాతీయ ఉద్యమంలో కనిపించాయన్నారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ ఢిల్లీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, తెలుగు సలహా మండలి కన్వీనర్ ఆచార్య సి. మృణాళిని,వాడ్రేవు చిన వీరభద్రుడు, డా.మామిడి హరికృష్ణ ,డా.కోయి కోటేశ్వరరావు, డా దోరవేటి పి.చెన్నయ్య, డా.రఘుశ్రీ, డా.నాళేశ్వరం శంకర్,డా.లావణ్య,డా.దేవేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# 'గృహలక్ష్మి' అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలి

**సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి**

**రామన్నపేట, విశాల భారతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ లాల్ బహదూర్ కు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించి ఇస్తామని ప్రకటించిన పేద మధ్యతరగతి వర్గాల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. మళ్లీ ఎన్నికలు వచ్చాయని హడావిడిగా గృహలక్ష్మి పథకాన్ని ప్రకటించి కంటితుడుపు చర్యగా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇస్తున్న ఈ కొద్ది ఇండ్లలో కూడా రాజకీయ జోక్యం విచ్చలగా విడిగా సాగుతోందని , గ్రామీణ ప్రాంతాలలోనూ పట్టణ ప్రాంతాలను స్లమ్ ఏరియాలో ఉండే నిరుపేదలకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, పట్టణ సెక్రెటరీ శివరాత్రి సమ్మయ్య, సీనియర్ కామ్రేడ్ బాలగోని మల్లయ్య, ఊట్కూరి భాగవంతం, రచ్చ యాదగిరి, కళ్యాణ్ రామ్, చందర్, గంగాపురం వెంకటయ్య, ఏనుతల రమేష్, కళ్లెం దశరథ, కాడయ్య, విసం గాలయ్య, ఎస్ ఎన్ చారి, కడమంచి జగన్నాథం, చల్ల యాదగిరి, మేడి మధు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం




**ఆమనగల్లు, విశాల భారతి:** మహిళా సాధికారతనే లక్ష్యంగా పని చేస్తూ కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డితో కలసి రాఘవేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందడుగు వేయాలన్నారు. వంటింటికే పరిమితం కాకుండా చైతన్యవంతం అయినప్పుడే సమాజంలో మార్పు వచ్చి ఇల్లు, ఊరు, గ్రామం, మండలం తద్వారా దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్నారు. గత 10నెలల నుండి విద్యా, వైద్యం, ఉపాధి కార్యక్రమాలు ప్రతీ గ్రామానికి తీసుకెళుతున్నామని, ఉపాధి లో భాగంగానే మహిళా సాధికారతే లక్ష్యంగా ఈ ఉచిత కుట్టు మిషను శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ప్రిన్సిపాల్ శ్యామల, మాజీ ఎంపిపి అన్నేపాక జంగయ్య, యంపిటిసి సభ్యులు నారమ్మ బాలరాజు గౌడ్, సర్పంచ్ లు హంసి రాంలాల్, స్వప్న సురేష్, వెంకటమ్మ , జంగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సూదిని జైపాల్ రెడ్డి, మోక్తాల కృష్ణయ్య గౌడ్, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# దుబ్బపల్లిలో పేకాటరాయుళ్ల అరెస్ట్

**గణపురం, విశాల భారతి:** మండలంలోని చెల్పూర్ శివారు దుబ్బపల్లిలో మంగళవారం ఏడుగురు పేకాటరాయులు అరెస్ట్ అయ్యారు. ఎస్ఐ సాంబమూర్తి కథనం ప్రకారం దుబ్బ పల్లిలో తరచూ పేకాటరాయుళ్లు ఆటలాడుతున్నారని తెలియడంతో పేకాటరాయుళ్లను వారు ఆట ఆడుతున్న వద్దకు వెళ్లి అరెస్ట్ చేసినట్లు.. రూ.7000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# చెట్టు పై నుండి పడి గీత కార్మికుడికి గాయాలు

**గణపురం, విశాల భారతి :** గణపురానికి చెందిన శంకర్ గౌడ్ అనే గీత కార్మికుడు మంగళవారం తాడిచెట్టు పైనుండి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. దీంతో అతన్ని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.



# గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

**నార్కట్ పల్లి, విశాల భారతి :** సమగ్ర గ్రామీణ అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్ పల్లి మండలంలోని మాండ్ర గ్రామంలో రూ. 2కోట్ల 10 లక్షలతో నిర్మించనున్న సబ్ మార్కెట్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు, రూ. 82.50 లక్షలతో నిర్మించనున్న నార్కట్ పల్లి మాండ్ర వయా చౌటబాయి బిటి రోడ్డు మరమత్తు పనులకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య లు శంకుస్థాపన చేశారు. అనంతరం తిరుమలగిరి గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలోని అమలవుతున్నాయని, పల్లెల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని సంక్షేమ పథకాలు ఇలాగే అమలు కావాలంటే బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించుకునే అవసరం ఎంతైనా ఉందని బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, నార్కెట్ పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరెందర్ రెడ్డి, చిట్యాల మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నార్కెట్ పల్లి మండల అధ్యక్షులు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, మాండ్ర సర్పంచ్ దొండ సౌమ్య రమేష్, తిరుమలగిరి సర్పంచ్ బోద యల్లమ్మ శ్రీను, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్ గౌడ్, రైతు బంధు మండల అధ్యక్షులు యానాల అశోక్ రెడ్డి,బివెళ్ళాంల ఎంపిటిసి చిరుమర్తి యాదయ్య, మాండ్ర ఉప సర్పంచ్ రమేష్, నాయకులు బద్దం రామిరెడ్డి,గ్రామ పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ప్రజాభిప్రాయం మేరకే కల్వకుర్తి బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలి

**ఆమనగల్లు, విశాల భారతి :** కల్వకుర్తి నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజల అభిప్రాయం మేరకు కల్వకుర్తి టికెట్ కేటాయించాలని, అభిప్రాయ సేకరణ చేయకుండా ఏకపక్ష నిర్ణయంతో ఇచ్చిన టికెట్ పై పార్టీ అధిష్టానం పునరాలోచించాలని నాగర్ కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. ధర్మం వైపు నడిచే కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంటే పర్యవసానం మరో విధంగా ఉంటుందని బాలాజీ సింగ్ చెప్పారు. పార్టీ వర్గాలకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించేందుకే వారి ఆహ్వానం మేరకే అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం తలకొండపల్లి మండలం వెంకట్రావుపేట గ్రామ సమీపంలో ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరిని సమన్వయపరిచి అభివృద్ధి చేయాల్సిన ఎమ్మెల్యే ఉద్యమకారులను అణగదొక్కి, ఇబ్బందుల పాలు చేసి కేసులు పెట్టించారని, ఉద్యమకారులకు మొండి చూయించి తన అనుచరులకు పదవులు ఇచ్చారని ఆయన ఆరోపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస రెడ్డి, సర్పంచ్ రమేష్ యాదవ్, ఎంపిటిసి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, నాయకులు రఘురాములు, హనుమ నాయక్, శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.





## మెడికల్ సీటు సాధించిన రితీష్ కి ఆర్థిక సాయం

**బెల్లంపల్లి, విశాలభారతి :** బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలం గంపలపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన తాల్లపల్లి రుతిష్ కి సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిస్ సీటు వచ్చింది. దీంతో వారికి 20,000 రూపాయల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించి, వారి వైద్య విద్యకు అయ్యే అన్ని రకాల ఖర్చులు తానే స్వయంగా భరిస్తానని, సహాయసహకారాలు అందిస్తామని బెల్లంపల్లి శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

**నకిరేకల్ - ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**



**చిట్యాల, విశాల భారతి:** బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేద లకు అండగా ఉంటుందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మండలం లోని వెంబాయి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు నక్క జానయ్య ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గ నిరుపేదలందరికీ బిఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలకు ఆకర్షతులై పార్టీ లో చేరుతున్నారని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటామని గులాబీ పార్టీ గెలుపే లక్ష్యంగా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కొలను వెంకటేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఆవుల అయిలయ్య యాదవ్, బిఆర్ ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి గునగంటి యాదయ్య, మండల ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు పంగారెక్క ప్రసాద్, పంగారెక్క కృష్ణయ్య పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**-ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

**బెల్లంపల్లి, విశాలభారతి:** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తాండూర్ మండలంలోని బోయపల్లి, ద్వారాకపూర్, నిలయపల్లెలో నూతన గ్రామ పంచాయతీ భవనాలకు మంగళవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.



## ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**కేతెపల్లి , విశాల భారతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీకూడా నెరవేర్చలేదని టీడీపీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జి యాతాకుల అంజయ్య ఆరోపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు, దలిత బందు గాని, బిసి బందు గాని , ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడేకరాలభూమి , కేజి టు పిజి విద్యగాని,మహిళా సంఘాలకు పావలావడ్డీ గాని, డబుల్ బెడ్ రూం అని, చెప్పుకుంటూ పోతె చేంతాడంత ఉంటుంది. కానీ ఏ ఒక్క హామీ నీ నెరవేర్చలేని బిఆర్ ఎస్ పార్టీ ఓట్లు అడిగే అర్హత కోల్పోయిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ తహసీల్దార్‌కు మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ భువనగిరి పార్లమెంటు కమిటీ అధికార ప్రతినిది రాంబనేష్ ముదిరాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గద్దపాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర బిసెల్ కార్యనిర్వాహణ కార్యదర్శి దోమ్మాటి సైదులు, మండల పార్థీ తాజా మాజీ ప్రదానకార్యదర్శి శ్రీ దోనాల వెంకట్ రెడ్డి , భువనగిరి పార్లమెంటు బిసెల్ కార్య నిర్వాహణ కార్యదర్శి బాదిని బిక్షం గౌడ్, మండలం సీనియర్ నాయకులు గుండాల వెంకన్న, శివగారు, నరేశ్ పాల్గొన్నారు.

## టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలి

**డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి**



**సూర్యాపేట , విశాల భారతి :** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 22 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆర్ వెంకట్రావు కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 22 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉద్యోగ సంఘాలు చెప్తున్నాయని వాటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో డీఎస్సీ నోటిఫికేషన్ వేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కేవలం 5,089 పోస్టులకు డీఎస్సీ వేస్తామని ప్రకటించడం సరికాదన్నారు.పదోన్నతుల ద్వారా ఖాళీ అయ్యే పోస్టులను కూడా ఈ నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేయాలని,అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడలన్నారు.వెంటనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 22 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో నిరుద్యోగులతో కలిసి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ డివైఎఫ్ఐ నాయకులు జై నరసింహ రావు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ జహంగీర్, గడ్డం వినోద్ తదిరులు పాల్గొన్నారు.



## చర్మ పరిశ్రమ భూములను రక్షించుకుందాం

**రాష్ట్ర సదస్సును సక్సెస్ చేయండి**

**భద్రాచలం, విశాల భారతి :** రాష్ట్రంలో చర్మ పరిశ్రమలకు సంబంధించిన భూములను, ఎస్సీ అసైన్డ్ భూములను రక్షించుకునేందుకు 'మా భూములు మాకేనని' నినాదంతో సెప్టెంబర్ 12న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగే రాష్ట్ర వ్యాప్త మాదిగ చర్మకారుల సదస్సును సక్సెస్‌చేయాలని తెలంగాణ మాదిగ చర్మకారుల లెదర్ పరిశ్రమ భూముల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కుసాపాటి శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. అంబేద్కర్ సెంటర్‌లో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కుసాపాటి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ మాదిగ చర్మకారులకు ఉపయోగకరంగా ఎండే లెదర్ పరిశ్రమ తెలంగాణ రాష్ట్రంలో నిర్వీర్యం అయిపోయిందన్నారు. లెదర్ పరిశ్రమకు సంబంధించిన భూములు ఈ రోజున తెలంగాణ ప్రభుత్వం ఐటీ పార్కులకు, కొత్త కలెక్టర్ కార్యాలయల నిర్మాణాలకు, పోలీస్ బెటాలియన్ క్యాంపులకు కేటాయించి మాదిగ చర్మకారులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం చర్మ పరిశ్రమను అభివృద్ధి పరిచి మాదిగ చర్మకారులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర నాయకులు గురజాల వెంకటేశ్వర్లు, తెలంగాణ మాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు గుండా రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు అలవాల రాజా మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ వలిగొండ పోలీస్



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** వలిగొండ మండల పరిధిలో ఇటీవల సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు పోలీసులకు భారీ సంఖ్యలో ఫిర్యాదులు చేశారు. దర్యాప్తు చేపట్టిన ఎస్సై ప్రభాకర్ వలిగొండ పోలీసులు ట్రేస్‌చేసి పోయిన ఫోన్లను వెంటనే బాధితులకు అప్పగించారు. దీంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఎస్సై ప్రభాకర్ మాట్లాడుతూ ఫోన్లు మిస్ అయితే దిగులు చెందవలసిన అవసరం లేదని వెంటనే పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



## తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలి

**కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**కోదాడ, విశాల భారతి:** విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని ఎస్ఆర్ఎం పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా శాసనసభ కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల, శాసన సభ్యుల విధుల తీరును తెలుసుకోవడానికి వచ్చిన సందర్భంగా విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు, పొలిటిశియన్ లుగా దేశం గర్వించే స్థాయికి ఎదగాలన్నారు. కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చే భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థులను పంపించిన ఎస్ఆర్ఎం పాఠశాల మేనేజ్ మెంట్ ను, తల్లిదండ్రులను, విద్యార్థులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రాఖీ పండుగ సందర్భంగా ముందస్తుగా ఎమ్మెల్యే కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.



## రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా రెవెల్లి రాజలింగు

**విశాలభారతి బెల్లంపల్లి:** మంచేరియాల్ లో బీజేపి జిల్లా అధ్యక్షులు వేరబెల్లి రఘునాథ్ రేవెల్లీ రాజ లింగునీ ఘనంగ సన్మానించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా శ్రీ రెవెళ్ళీ రాజ లింగు నియామకం జరిగిన సందర్భంగా ఈ కార్యక్రమం జరిగినది. జిల్లా అధ్యక్షులు వెరబెళ్ళీ రఘునాథ్ తో పాటు మాంచెరియల్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు రాజమల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సబ్బనీ రాజ నర్సు, తదితర జిల్లా ఆ పై స్థాయి నాయకులు పాల్గొన్నారు.



## ప్రగతి భవన్ పై ఉన్న శ్రద్ధ.. పాఠశాలల మీద లేదాయె..

**పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతకాని రాకేశ్**

**మహబూబాబాద్ /కేసముద్రం, విశాల భారతి :** ప్రగతి భవన్ కట్టేందుకు ఉన్న శ్రద్ధ ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వానికి లేదు ఎందుకని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతకాని రాకేష్, కాకతీయ యూనివర్సిటీ కార్యదర్శి కామగోని శ్రావణ్ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. కేసముద్రం మండలంలోని కల్వల గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండటానికి వంటగది లేదని, ఆరు బయటనే వంట చేస్తున్నారన్నారు. విద్యార్థులకు కనీసం తాగునీటి సౌకర్యం లేదని, విద్యార్థులు ఇంటి వద్ద నుంచి బాటిల్స్ లలో మంచినీళ్లు తెచ్చుకుంటున్నారని వాపోయారు. పాఠశాలలో వెంటనే ఆర్ వో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్‌లో టాయిలెట్స్ లేక స్టూడెంట్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. స్కూల్లో ఉపాధ్యాయ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయన్నారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. వంశీ, అరుణ్, అభిరామ్, ఉపేందర్ పాల్గొన్నారు.




## `దశలవారీగా సమస్యల పరిష్కారం`

**తుర్కయంజాల్, విశాలభారతి:** తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధిలోని ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాంరెడ్డి తెలిపారు. రాగన్న గూడ వార్డు కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా అనురాధ రాంరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అత్యవసరంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వీధిలైట్లు, నీటి సమస్యను అధిగమించడానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో 25 అంశాలను కౌన్సిల్ ఆమోదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, వైస్ చైర్ పర్సన్ హరిత ధన్ రాజ్ గౌడ్, కౌన్సిలర్లు, అధికారులు, పుర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## క్రీడా పరికరాల పంపిణీ



**మఠంపల్లి, విశాల భారతి:** మఠంపల్లి మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా క్రీడా మాంత్రికుడు ధ్యాన్‌చంద్ ఫొటోకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం క్రీడా పథకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభరత్ రెడ్డి సహకారంతో క్రీడాకారులకు స్పోర్ట్స్ మెటీరియల్స్ ను అందించారు. పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల దశలోని క్రీడా నైపుణ్యాలను మెలికలను, నేర్పించడం ద్వారా రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీలలో గెలుపొందటం జరుగుతుందని, క్రీడల ద్వారా మానసిక ఒత్తిడిని జయించి, ఉన్నత ఫలితాలను రాబట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రూబీ, సిస్టర్ మార్కరేట, సిస్టర్ శుభశ్రీ, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్ణాటి తరుణ్ రెడ్డి, నాగరాజు, శ్రీను, స్వర్ణ నాగలక్ష్మి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాలే.. భారమే పెరిగింది



**మునగాల, విశాల భారతి:** రైతులకు రుణమాఫీ జరగలేదు..కానీ రుణ భారం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చంద్రయ్య అన్నారు. మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుల లక్ష రూపాయల రుణాన్ని మాఫీ చేస్తున్నానని, రైతుల అకౌంట్లో జమ చేస్తున్నానని రైతులు నేరుగా డబ్బులు తీసుకోవచ్చని మాయ మాటలు చెప్పారన్నారు. మునగాల పరిధిలో తాడువాయి సొసైటీలో స్వయంగా తాను తీసుకున్న రుణం రూ. 52,000, కాగా దానికి ప్రభుత్వం వడ్డీ కోసం 3,000 కలిపి 55 వేల రుణమాఫీ కింద ఇచ్చిన లిస్టులో విషయం బయటపడిందన్నారు. ఇంకా నేను 23,000 కట్టాలని సీఈవో చెప్పారన్నారు. తాడువాయి సొసైటీ పరిధిలో రుణమాఫీ కింద ఉన్న రైతులందరూ ఈ పరిస్థితిని పరిశీలించి సొసైటీ ముందు ఆందోళన చేయాలని, మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు.



## పాలకుర్తి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నా..

**ఎర్రంరెడ్డి తిరుపతి రెడ్డి**

**పాలకుర్తి, విశాల భారతి:** పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్నట్లు కాంగ్రెస్‌నేత ఎర్రంరెడ్డి తిరుపతి రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని భార్గవి గార్డెన్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో తాను ఊహించిన దానికంటే ఎక్కువగా నాపై ప్రజలు అభిమానం చూపుతుండడంతో బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నానని, పాలకుర్తి టికెట్ వస్తుందని ఆశిస్తున్నానని ,ప్రజా సేవ చేయడానికే అమెరికా వదిలి వచ్చానని చెప్పారు. అనంతరం పెద్దమడూరులో కొత్తగా నిర్మించిన వీరన్న గుడి లో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామానికి చెందిన బబ్బూరి సత్తయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం దారావత్ తండాకు చెందిన రేషన్ డీలర్ కునుసోత్ లక్ష్మణ్ సస్పెండ్ ఎందుకు చేశారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు నేనున్నానని అధైర్య పడకండి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎక్స్ ఎంపీపీ గడ్డం యాకస్వామి పాలకుర్తి మాజీ దేవస్థానం చైర్మన్ గంగు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

**ఏబీవీపీ కార్యకర్తల అరెస్ట్**



**పాలకుర్తి , విశాల భారతి :** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రూ.5,300కోట్ల స్కాలర్ షిప్ లు ఫీజురీయంబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేసి ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధన బోధనేతర సిబ్బందిని వెంటనే నియమించాలనే డిమాండ్లతో ఏబీవీపీ రాష్ట్రశాఖ పిలుపుమేరకు పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్రసంయుక్త కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ" విద్యార్థి వ్యతిరేకవిధానాలు అవలంబిస్తున్న కేసీఆర్ ప్రభుత్వం మద్యం టెండర్ ల నిర్వహణ మీద ఉన్న శ్రద్ధ టిఎస్పీ ఎస్ సి పరీక్షల నిర్వహణ మీద లేదని అందుకే ప్రతి పేపర్ లీక్ అవుతుందని అన్నారు. సంక్షేమ హాస్టల్ లల్లో ఆహారం సదుపాయలు సరిగా లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం పాలవ్వుతున్నారని పాలకుర్తి మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెంటనే ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ధర్నా కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్స్ హర్షవర్ధన్ వెలుపల రాజు కుమార్ జిల్లా కన్వీనర్ దేవేందర్ మహానగర్ కార్యదర్శి సుజిత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరుణ్ భాను కౌశిక్ శ్రీనివాస్ భరత్ శ్రవణ్ కుమార్ జస్వంత్ రాహుల్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.




# విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

**జఫర్ గడ్, విశాల భారతి :** ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యల పరిష్కారానికి మ సెప్టెంబర్ 1న హైదరాబాద్ లో నిర్వహించనున్న మహాధర్నా కు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు కే.రాజు,సురేష్ కుమార్, వేణు, సుధాకర్, భాను ప్రకాష్ పిలుపునిచ్చారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యా రంగ సమస్యలపై ప్రభుత్వము చిన్న చూపు చూస్తుందని, ఉపాధ్యాయులు,ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.విద్యా రంగాన్ని బలోపేతం చేస్తాం. కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి నేటికి ఒక్క హామీని కూడా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని లేకపోతే ఉద్యోగులు,ఉపాధ్యాయుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో యూఎస్ పిసి నాయకులు సలావుద్దీన్, శ్రీనివాస్,బాలోజీ,ఉమా రాణి తదితరులు పాల్గొన్నారు.





# జీతాలు పెంచాలంటూ ఆశా వర్కర్ల డిమాండ్

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం**

**షాద్ నగర్, విశాల భారతి:** ఆశవర్కర్ల జీతాలను పెంచి, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కోరుతూ మంగళవారం ఆశా వర్కర్లు షాద్ నగర్ లో తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కు వినతి పత్రం అందజేశారు. తమ పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయం ముందు ధర్నా నిర్వహించే ప్రయత్నం చేశారు. ఆశా నాయకురాలు లలిత మాట్లాడుతూ ఆశా వర్కర్లు కరోనా మహమ్మారి కాలంలో వైరస్‌ను నియంత్రించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. పనికి తగిన వేతనాలు ఇవ్వడం లేదని, పారితోషికాలను రూ.18,000కు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కోరారు. దీనిపై ఏమ్మెల్యే స్పందించారు. కమ్యూనిస్టు పాలిత రాష్ట్రాలలో హెల్త్ వర్కర్లకు ఎంత పారిపోషకం ఇస్తున్నారో చెప్పాలని షాద్ నగర్ ఎమ్మెల్యే అంజయ్య సీపీఎం నాయకులను ప్రశ్నించారు. మీ రాష్ట్రాలలో ఎంత ఇస్తున్నారో మాకు తెలుసు. మా రాష్ట్రంలో మా సీఎం కేసీఆర్ ఎంత ఇవ్వాలో తెలుసు రాజకీయంగా సమస్యలను వాడుకోవద్దని ఎమ్మెల్యే అంజయ్య ఆందోళనకారులకు హితవు పలికారు. ఈ మేరకు ర్యాలీ నిర్వహించడానికి సిఐటియు నాయకులు ప్రయత్నించగా ఆశ కార్యకర్తలను, సిఐటియు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. కార్యక్రమంలో సిఐటియూ నాయకులు ఎన్.రాజు, ఈశ్వర్ నాయక్,శ్రీనునాయక్,సాయిబాబు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**షాద్ నగర్, విశాలభారతి:** ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని విశ్వభారతి, విజ్ఞాన్, విజేత కళాశాలలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ షాద్ నగర్ సంయుక్త కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. దేశ సంస్కృతికి విరుద్ధమైన విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పవన్ కళ్యాణ్, నవీన్, అమరేందర్ రెడ్డి, భరత్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయండి

**ఆమనగల్లు, విశాల భారతి :** జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రామ్ రెడ్డి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 25 మందిని ఐఓఎల్ ఆపరేషన్ నిమిత్తం రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ కు తరలించినట్లు లయన్స్ క్లబ్ పి ఆర్ ఓ పాషా తెలిపారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవ నేత్ర దాన ర్యాలీను, అవగాహన శిబిరాన్ని ఆప్తాలమిక్ ఆఫీసర్ ఏం. చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లదానంపై నినాదాలు చేయించారు. నేత్రదానం మహాదానం అని.. నేత్రదానం చేసి అమరులు కావాలని, ఒక్కరి నేత్రదానం మరో ఇద్దరికి కంటిచూపునిస్తుందని ఆయన తెలిపారు. కంటి వైద్య శిబిరానికి వచ్చిన వారితో, ఆస్పత్రి సిబ్బంది లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి నేత్రదాన ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం గోడ పత్రికను విడుదల చేశారు. నేత్రదాన పక్షోత్సవ ర్యాలీలో ఈనెల 25 నుండి వచ్చే నెల 8 వరకు కొనసాగుతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ బి యాదయ్య, లయన్స్ క్లబ్ ఫాస్ట్ రీజియన్ చైర్ పర్సన్ ఎం. చంద్రశేఖర్, క్లబ్ కోశాధికారి కొరివి వెంకటయ్య, క్లబ్ పిఆర్ఓ పాషా, మరియు సభ్యులు ఏలే. శివకుమార్, వి.రామ్మోహన్, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, జైపాల్, ఆసుపత్రి సిబ్బంది లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు సేవలందించడం ట్రాయ్ ముఖ్య లక్ష్యం

**చర్ల, విశాల భారతి:** 1997వ సంవత్సరంలో టెలికాం వినియోగదారుల హక్కుల కోసం టెలికాం రెగ్యులేటరీ అధారిటీ ఆఫ్ ఇండియా యాక్ట్ తీసుకొచ్చామని భారత టెలికాం ప్రాధికార సంస్థ ట్రాయ్ కాగ్ సభ్యుడు రావూరి ప్రభాకర రావు అన్నారు. మొబైల్ నెంబర్ 2006 నుంచి పోర్టబిలిటీ అవకాశాన్ని కల్పించినట్టు.. 2025 నాటికి దేశవ్యాప్తంగా 7 లక్షల గ్రామాలలో ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో కాగ్ సభ్యులు ఆర్ ప్రభాకర రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కృష్ణమోహన్, కళాశాల కరస్పాండెంట్ సిహెచ్. కృష్ణకుమారి , సతీష్ కుమార్, కారం .సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ A. కొండలరావు భద్రాద్రి కళాశాల ప్రిన్సిపల్ G. అశోక్, కళాశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వినియోగదారులు ఎదుర్కొన్న సమస్యల గురించి తెలుసుకొని వాటిని ఎలా ఎదుర్కోవాలో ట్రాయ్ సభ్యుడు ప్రభాకర రావు అందరికీ అర్థమయ్యేలాగా వివరించారు








# తహసీల్దార్ ను కలిసిన ఎస్సీ సెల్ కాంగ్రెస్ లీడర్లు

**శాలిగౌరారం,విశాలభారతి:** శాలిగౌరారం మండల తహసీల్దార్ పాల్ సింగ్ ఇటీవలే బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం శాలిగౌరారం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరమాండ్ల నరేశ్ ఆధ్వర్యంలో తహసీ ల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించి రైతులు ఎదుర్కొంటున్న ప్రధానమైన భూ సమస్యను పరిష్కరించే విధంగా పార్టీలకు అతీతంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి బోడ దానయ్య అడ్లూరు కాంటెస్ట్ ఎంపీటీసీ గరిగంటి శంకర్ మండల నాయకులు మిర్యాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




## కొల్తూరులో షాడో సర్పంచ్..

# పదవి భార్యది పెత్తనం భర్తది

**మేడ్చల్, విశాల భారతి :** మూడు చింతలపల్లి మండలంలోని కొల్తూరు గ్రామంలో పాలన గాడి తప్పుతోంది. ప్రజా ప్రతినిధులు వారి వారి గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు పోటీ పడుతుంటే కొల్తూరు గ్రామంలో సర్పంచ్ భర్త (షాడో సర్పంచ్ ) అక్రమాలను ప్రోత్సహిస్తూ దోచుకోవడానికి మాత్రమే పోటీ పడుతున్నాడు.

**సర్పంచ్ పతియే బాస్ ..** కొల్తూరు గ్రామంలో ఏ నిర్మాణాలు చేపట్టాలన్న ఏం చేయాలన్నా ముందుగా ఆయన అనుమతి తప్పనిసరి. ముందుగా అతని చేతిలు తడపాల్సిందే లేదంటే వాళ్ళని ఎలా ఇబ్బందులకు పెట్టాలో తన దారికి ఎలా తెచ్చుకోవాలో అతనికి వెన్నతో పెట్టిన విద్య. కొల్తూరు గ్రామంలో నూతనంగా నిర్మాణాలు చేపట్టాలన్న నిర్మానుదారులు బెంబేలు ఎత్తిపోతున్నారు. గ్రామ సమస్యలను పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడసాగిస్తున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అయోమయంలో గ్రామస్తులు ..**
సర్పంచిగా గెలిచి ఐదు సంవత్సరాలు కావస్తున్న అసలు సర్పంచ్ మాత్రం సీటుకే పరిమితం కావడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. గ్రామంలోని సమస్యలను సర్పంచ్ కి వెళ్లబోసుకుందామని వెళితే సర్పంచ్ కీ బదులు షాడో సర్పంచ్ పెత్తనం చెల్లాయించడం ఎంతవరకు సమంజసం అని అంటున్నారు. సర్పంచ్ భర్త పెత్తనం చెల్లాయించడంతో ఓట్లు వేసి గెలిపించింది నల్ల శిల్ప నా లేక ఆమె భర్త యాదగిరిన అని, గ్రామ సర్పంచ్ ఎవరు అని ప్రశ్నించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు షాడో సర్పంచ్ పై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**మండల పంచాయతీ అధికారిని వివరణ కోరగా..**
ఎం.పీ .ఓ. సునీత , మూడు చింతలపల్లి మండలం కొల్తూరు సర్పంచ్ శిల్పాకి బదులు భర్త యాదగిరి పెత్తనం చెలాయిస్తున్నాడని మాకెవ్వరు ఫిర్యాదు చేయలేదు విచారణ జరుపుతాం ఒకవేళ నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం అని తెలిపినట్లు సమాచారం.



# 'శేరిలింగంపల్లి అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తా'

**రూ.64.50 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

**శేరిలింగంపల్లివిశాల భారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలుగా అభివృద్ధి చేసేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని జయభరత్ నగర్, బృందావన్ కాలనీ, నాగార్జున హోమ్స్ లో రూ. 64.50 లక్షల అంచనా వ్యయంతో చెపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి కెసిఆర్, మార్గదర్శకంలో మంత్రి కేటీఆర్ సహకారంతో శేరిలింగంపల్లి నియోకజకర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని గాంధీ పేర్కొన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డ్ మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాలనీ వాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**అమనగల్లు, విశాల భారతి :** విద్యార్థిని, విద్యార్థులు, యువకులు, పాఠశాల.. కళాశాలలో నిర్వహించే క్రీడా పోటీలలో పాల్గొనాలని.. తద్వారా మానసిక ఉల్లాసంతో పాటు క్రీడారంగంలో రాణించొచ్చని సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జంగయ్య, విద్యార్థులతో కలిసి జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న జాతీయ క్రీడా దినోత్సవం ఎందరో విద్యార్థుల, యువకులలో స్ఫూర్తిని నింపుతుందని సర్పంచ్ తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో క్రీడా రంగంలో రాణించే విద్యార్థిని విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, మల్లయ్య, పిఈటి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తికి తీవ్రగాయాలు

**షాద్ నగర్, విశాల భారతి:** 33/11కెవి విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్ ఘాతానికి గురై వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నారాయణగూడ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక కౌన్సిలర్ వీరమోని హేమదేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో చేగూర్ రాజు అనే వ్యక్తికి చెందిన ఇంటికి మరమత్తులు చేస్తున్న సందర్భంలో పైపు 33/11కెవి విద్యుత్ వైర్లకు తగలడంతో ప్లంబర్ వర్కర్ పవన్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం స్థానికులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి సీరియస్ గా ఉందని చెప్పారు. ఈ మేరకు కొత్తూరు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ప్రమాదం జరిగిన అనంతరం అధికారులు అక్కడికి చేరుకుని బిల్డింగ్ పనులను పరిశీలించారు.


శివసేన రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న సౌందర్య రాజన్

# శేరిలింగంపల్లి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సౌందర్ రాజన్

**శేరిలింగంపల్లి, విశాల భారతి:** శేరిలింగంపల్లికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు సౌందర్య రాజన్ ఆ పార్టీ శేరిలింగంపల్లి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి చేతుల మీదుగా మంగళవారం నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సౌందర్య రాజన్ మాట్లాడుతూ.. తన నియమాకానికి సహకరించిన యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు బివి శ్రీనివాస్, రాష్ట్ర ఇంచార్జి దివేది, రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి, జిల్లా అధ్యక్షులు రవికాంత్ గౌడ్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీహరి గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా తన శక్తి వంచన లేకున్న కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలోయువజన కాంగ్రెస్ నాయకులు కప్పెర దుర్గేష్, శామ్యూల్ ఎడ్వర్డ్ తదితరులు ఉన్నారు.



# బోడుప్పల్ 21 డివిజన్లో హరితహారం..

**బోడుప్పల్, విశాల భారతి:** బోడుప్పల్ నగర పాలక సంస్థ 21 డివిజన్ పరిధిలోని సాయిభవానినగర్ కాలనీలో హరితహారంలో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ భూక్య సుమన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరిత డివిజన్ గా తీర్చిదిద్దడంలో ప్రజలంతా భాగస్వాములై హరితహారం స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ షాన్బాబు, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షకార్యదర్శులు తిరుపతిరెడ్డి, వెలుగొండయ్య, నాయకులు రాములు గౌడ్, కృష్ణమాచారి, నిర్మల, లతా, కాలనీవాసులు ఆంజనేయులు, అంజిరెడ్డి, రామకృష్ణ, నాగేశ్వరరావు, సురేష్‌రెడ్డి, రఘురాజు, రఘు, రమేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 108లో గర్భిణి ప్రసవం.. పండంటి మగబిడ్డకు జన్మ

**షాద్ నగర్, విశాల భారతి:** షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం పాటిగడ్డ వద్ద 108లో ఓ గర్భిణి ప్రసవించింది. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. చౌలపల్లి గ్రామానికి చెందిన హేమలతకు సోమవారం రాత్రి పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. చౌలపల్లి చేరుకున్న 108 వాహనం సిబ్బంది గర్భిణిని కేశంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారు షాద్ నగర్ ఆసుపత్రికి రిఫర్ చేయడంతో ఆమెను షాద్ నగర్ తరలిస్తుండగా, ఆమెకు పురిటినొప్పులు అధికమయ్యాయి. పాటిగడ్డ సమీపంలో రాత్రి 11:32 నిముషాలకు పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను షాద్ నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. బాబుకు నెలలు నిండక పోవడంతో వైద్యులు నీలఫర్ ఆసుపత్రికి పంపించారు. 108 సిబ్బంది ఈఎంటి రామచందర్, పైలెట్ దీపక్ లను భర్త స్వామియాదవ్, మహిళ కుటుంబసభ్యులు, వైద్యులు అభినందించారు.







# ఘనంగా దృశ్య జన్మదిన వేడుకలు



టిపిసిసి అదికార ప్రతినిధి ఓయు విద్యార్థి నాయకుడు చనగాని దయాకర్ కూతురు దృశ్య జన్మదిన వేడుకలను సోమవారం ధస్ పల్ల హోటల్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సినియర్ నేతలు మాజీ ఎంపి కాంగ్రెస్ ప్రచార కమిటి చైర్మన్ మధు యాషికి గౌడ్ ,నల్గొండ ఎంపి ఉత్తమ్ కూమర్ రెడ్డి , మాజీ ఎంపి హనుమంత రావు ,మాజీ ఎంపి భువనగిరి భూర నర్సయ్య గౌడ్ , నకిరెకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, హైదరాబాద్ ఏంఎల్ సి ఎవిన్ రెడ్డి, దిలీప్ , ఉన్నత విద్య మండలి చైర్మన్ లింబాద్రి, ఓయు వీసి రవీందర్ , గీత కార్మిక చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్, ప్రముఖ విద్యా &వైద్య ప్రముఖులు ఓయు విద్యార్థి నాయకులు హజరై దృశ్యని దీవించారు.

-హైదరాబాద్,విశాలభారతి

# కల్వల మోడల్ స్కూల్ కి ఆర్టీసీ బస్సులు నడపాలి

**సీవైఎస్ఎస్ - జిల్లా అధ్యక్షుడు శరత్**



**మహబూబాబాద్ / కేసముద్రం, విశాల భారతి:** కేసముద్రం మండలం కల్వల గ్రామానికి శివారులో ఉన్న మోడల్ స్కూల్ కి ఆర్టీసీ బస్సులు నడపాలని మహబూబాబాద్ డిపో సూపరింటెండెంట్ కు కి ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సి.వై.ఎస్.ఎస్ జిల్లా అధ్యక్షుడు శరత్ మాట్లాడుతూ కేసముద్రం మండలం కల్వల గ్రామంలో ఉన్నటువంటి మోడల్ స్కూల్ కి దాదాపు 300 మంది విద్యార్థులు ప్రైవేట్ వెహికల్స్‌లో ఏటా దాదాపు 20వేల రూపాయల వరకు ఖర్చు చేసుకొని పాఠశాలకు వస్తున్నారని వాపోయారు. వెంటనే వారికి ప్రభుత్వం ఆర్టీసీ బస్సులు ఆ రూటులో నడపాలని అన్నారు. స్వాతంత్రం వచ్చి 76 ఏండ్లు గడుస్తున్నా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు అన్ని రూట్లో ఆర్టీసీ బస్సులు నడపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సి వై ఎస్ ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లకుంట రాజేందర్ పటేల్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో హెల్త్ఎమర్జెన్సీ ప్రకటించాలి

**ప్రజల ప్రాణాలు కాపాడడంలో**
**బీఆర్ఎస్విఫలం**



**వాజేడు, విశాల భారతి :** వాజేడు మండల వ్యాప్తంగా ప్రజలు విష జ్వరల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని, వైద్యం అందక పలువురు మృత్యువాత పడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు అన్నారు. మంగళవారం ధర్మవరం గ్రామంలో జరిగిన సిపిఎం పార్టీ సమావేశం లో రఘుపతిరావు మాట్లాడుతూ మండలం లో ప్రజలు వ్యాధుల బారిన పడి అల్లాడుతుంటే వారి ఆరోగ్యాల గురించి పట్టించుకోవాల్సిన ప్రభుత్వం.. వచ్చే ఎన్నికలలో ఎలా గెలవాలి అనే జపం చేస్తుందని విమర్శించారు. విష జ్వరాలను ఎలా ఎదురుకోవాలి అనే ప్రణాళిక లేకుండా ప్రభుత్వం గుడ్డిగా వ్యవహారిస్తుందని, ప్రభుత్వ వైద్యం మీద నమ్మకం లేక ప్రజలు ప్రయివేట్ వైద్యం వైపు వెళ్తున్నారు. జ్వరాలు ప్రబలుతున్నా.. పీవో, కలెక్టర్ ఎవరు కూడా పీహెచ్‌సీలు ఏరియా హాస్పిటల్స్ సందర్శించక పోవటం విడ్డురంగా ఉందన్నారు .ఇకనైనా అధికారులు ప్రభుత్వం ద్రుష్టి పెట్టి, వైద్య సేవలపై ద్రుష్టి పెట్టాలని డిమాండ్ చేశారు... ఈ కార్యక్రమం లో... సిపిఎం నాయకులు ఎండీ దావుద్, గొంది రాజేష్, గుగ్గిళ్ళ దేవయ్య, బోట సత్యం, గౌరారపు చంద్రశేఖర్, తోట సంజీవ్, టింగా పగిడయ్య, తదితరులు పాల్గొన్నారు.



# బీసీలకు లక్ష సాయం చెక్కుల పంపిణీ

**అర్హులకు అందలేదని**
**పలువురి ఆందోళన**

**వాజేడు, విశాల భారతి :** వాజేడు మండలంలోని 17 పంచాయతీల్లో 60 మంది లబ్ధిదారులకు బీసీలకు లక్ష రూపాయల సాయం చెక్కులను వాజేడు ఎంపీపీ శ్యామల శారద అధ్యక్షతన బీసీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. చేతి వృత్తిదారులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ,జడ్పీటీసీ తల్లడి పుష్పలత ఎంపీడీవో విజయ ఎం పి ఓ శ్రీకాంత్ సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**అర్హులకు అందలేదని ఆవేదన**

నూతనంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బందు అర్హులైన లబ్ధిదారులకు అందలేదని రజక సంఘం పేరూరు గ్రామ అధ్యక్షులు గొర్ల పెల్లి కోటేశ్వరరావు ఆరోపించారు. పేరూరు గ్రామంలో రజక కుటుంబాలు 9 ఉండగా 6 కుటుంబాల వారుబీసీ బందు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఆరుగురిలో ఒక్కరికి కూడా ఎంపిక చేయకపోవడం పట్లఆగ్రహం వ్యక్తం చేశారు.దీనిపై సమగ్ర విచారణ జరిపి రజకులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక పంచాయతీ సర్పంచ్ యాలం సరస్వతి కార్యదర్శి రమేష్ కు వినతి పత్రం అందజేశారు.



# ఘనంగా ధ్యాన్ చంద్ జయంతి

**చిట్యాల, విశాల భారతి :** భారత హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించేక జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధ్యాన్ చంద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాధవి పాఠశాల ఆవరణలో ధ్యాన్ చంద్ ఫొటోకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ హాకీ క్రీడ ద్వారా మన దేశ పేరు, ప్రతిష్టల్ని అంతర్జాతీయంగా చాటి చెప్పిన ఘనత ధ్యాన్ చంద్ కే దక్కిందని అన్నారు .ప్రపంచ ఒలంపిక్స్ లో మూడుసార్లు ధ్యాన్ చంద్ సారథ్యంలో భారతదేశం మూడు సార్లు బంగారు పతకాలు సాధించిందని , మెరుపు వేగంతో గోల్స్ చేయటం , తన పుట్ వర్క్ తో ఎదుటి ఆటగాళ్లను చిత్తు చేయగల సామర్థ్యం గల క్రీడాకారుడిగా ధ్యాన్ చంద్ మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ , ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు .




# డోర్నకల్‌లో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి

**మహబూబాబాద్/డోర్నకల్, విశాల భారతి:** డోర్నకల్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మసీద్ సెంటర్లో దీక్ష నిర్వహించడం జరిగింది. ఈ దీక్షకి సంఘీభావం తెలిపిన పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేశ్ మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గలో జూనియర్ కాలేజీ లేకపోవడం చాలా బాధాకరమని, 30 ఏండ్లుగా పరిపాలిస్తున్న ఎమ్మెల్యే జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. కాలేజీ లేక విద్యార్థులు దూర ప్రాంతాలైన ఖమ్మం, మహబూబాబాద్ వెళ్లాల్సి వస్తుందని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్నటువంటి కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలో ఫీజులు కట్టలేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, మండల కేంద్రంలో చాలామంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, పిడిఎస్యు నాయకులు సాయి, ప్రకాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మధు సాయికుమార్, నాయకులు గందసిరి జ్యోతి బస్, జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి, రాజేష్, వీరేందర్, శ్రీలత, సుష్మిత, తరుణ్, మనోజ్, హేమంత్, అజయ్, శశి కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ పోరాటానికి సిద్ధం కండి

**మావోయిస్టుల పిలుపు**
**ఏజెన్సీలో వెలిసిన పాంప్లెంట్లు**




**వాజేడు, విశాల భారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని జగన్నాపురం జంక్షన్ వద్ద నేషనల్‌హైవే పక్కన సీపీఐ( మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో పాంప్లెంట్లు వెలువడడంతో వాజేడు మండలంలో భయానక వాతావరణ ఏర్పడింది. పాంప్లెంట్లో రాష్ట్రంలో ధరణి పోర్టల్ ద్వారా భూమి సమస్యలతో రైతుల దివాళా తీస్తున్నారని మావోయిస్టులు వాపోయారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ విప్లవం జరగకుండా రైతాంగం ఈ సమస్యల నుండి బయటపడడం సాధ్యం కాదన్నారు. గ్రామీణ ప్రాంతంలో రాజ్యం సహకారంతో ఆధిపత్యాన్ని చాలా ఇస్తున్న ఉంటాను దెబ్బతీయకుండా వ్యవసాయం ముందుకు తీసుకెళ్లడం వీలుకాదన్నారు. నాలుగు దశాబ్దాలుగా రాష్ట్రంలో వ్యవసాయ విప్లవం జరిగి భూస్వాముల పెట్టుబడిదారుల పునాదులు కదిలిపోగా వీటిని మళ్లీ పునరుద్ధరించడానికి పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతంలో దెబ్బతిన్న బడా భూస్వాముల అధికార అధికారం స్థాపనలో పోలీసుల సహకారంతో పాత కొత్త భూస్వాముల కాంట్రాక్టర్ల గ్రామ వర్గం ఒక వ్యవస్థగా ఏర్పడి ప్రజలకు అన్ని రకాలుగా పీడిస్తున్నారు. ఈ దోపిడీ ముఠా గ్రామీణ ప్రాంతాల్లో సామ్రాజ్యవాదుల దళారి నిరంకుశ బడా బూర్జ భూస్వాముల ప్రయోజనాలను కాపాడడంతో ప్రజలను అణిచివేస్తుంది.



# తెలంగాణ వీర వనిత ఐలమ్మ విగ్రహం పెట్టాలి

**పాలకుర్తి, విశాల భారతి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని వెంటనే నెలకొల్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాలకుర్తి నియోజకవర్గకేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి కపిలవాయి వెంకటేశ్వర చారి గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ పాల్గొని మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాటం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ అన్నారు. గతంలో సీపీఎం ప్రజా సంఘాలు పలు పార్టీల ఆధ్వర్యంలో పాలకుర్తి మండల కేంద్రంలో ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే సుందరీకరణ పేరుతో చౌరస్తాలో ఉన్న ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని తొలగించారన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో భద్రపరిస్తే సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపడితే స్థానిక గ్రామపంచాయతీ అధికారులు నెల రోజుల్లో పునప్రతిష్ట చేస్తామని హామీ ఇచ్చారని, నెలలు గడుస్తున్నా పెట్టడం లేదన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న మండల కార్యదర్శి మాచర్ల సారయ్య మండల నాయకులు సోమసత్యం రాములమ్మ, మాసంపల్లి నాగయ్య, మూస్కు ఇంద్రారెడ్డి బెల్లి సంపత్ పనికిరా రాజు కాకర్ల బాబు, తదితరులు పాల్గొన్నారు.




# 'ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోవాలి'

**తుర్కయంజాల్, విశాలభారతి:** సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. కోహెడకు చెందిన సామల యూసుఫ్‌రెడ్డి, పల్లపు మహేశ్వరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను క్యాంపు ఆఫీసులో అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలు మెరుగైన వైద్యం అందిపుచ్చుకునేందుకు సీఎంఆర్ఎఫ్ ఎంతో దోహదపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ సిద్ధాల జ్యోతి జంగయ్య, అబ్దుల్లాపూర్‌మెట్ రైతుబంధు కోఆర్డినేటర్ కందాల బలదేవరెడ్డి, కోహెడ రెండో వార్డు బీఆర్ఎస్ అధ్యక్షులు బుడ్డ విజయ్ బాబు, బీఆర్ఎస్ నాలుగో వార్డు అధ్యక్షుడు పల్లపు ఆంజనేయులు, పసుల దేవేందర్ ముదిరాజ్, కుమార్, పల్లపు యాదగిరి, టీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



# యువకులకు షటిల్ బ్యాడ్మింటన్ కిట్ అందజేత

**దేవరుప్పుల, విశాల భారతి :** క్రీడలు మానసికల్లాసానికి దోహదపడతాయని యువత చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపి రాణించాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు సామాజికవేత్త బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఇటీవలే మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బర్త్‌డే సందర్భంగా పెద్దమడూరు గ్రామ యువతకు పెద్ద ఎత్తున వాలీబాల్ క్రికెట్ కిట్స్ అందించి యువతను ప్రోత్సహించిన విషయం తెలిసిందే నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దమడుర్ ఆదర్శ యువ మండలి యువకుల కోరిక మేరకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుదేశానుసారం యువజన సంఘానికి షటిల్ బ్యాట్మెంటన్ కిట్ ల ను అందజేసి క్రీడా మైదానాన్ని కూడా తయారు చేయిస్తున్నట్లు శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ క్రీడలు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయని యువత క్రీడలపై మక్కువ చూపి క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.యువత మాట్లాడుతూ యువకులకు సహాయ సహకారాలు అందిస్తూ క్రీడా సామాగ్రి అందజేసిన బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కారుపోతుల శ్రీనివాస్ గౌడ్, గ్రామ ఉపసర్పంచ్ మానుపాటి వెంకటేష్,మండల పార్టీ ఉపాధ్యక్షుడు నల్ల ఉమేష్ , యువజన సంఘం అధ్యక్షుడు చంద్రగిరి సంపత్,ఉపేందర్, సంతోష్, సంపత్, రాములు, తదితరులు పాల్గొన్నారు.



# రహదారికి అడ్డంగా కంప చెట్టు

**తొలగించే నాధుడే లేడా?**

**మోతె , విశాల భారతి:** మంగళ వారం మండల పరిధిలోని బుర్క చర్ల గ్రామానికి వెళ్ళే దారిలో రోడ్డుకు అడ్డంగా పెరిగి రాక పోకలకు అంతరాయం కలుగుతుందని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు కోరుతున్నారు. మండల కేంద్రానికి సుమారు పది కిలోమీర్లు సమీపం లో ఉన్న గ్రామాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ప్రజా ప్రతినిదులు విఫలం అయ్యారని పలువురు చర్చించు కుంటున్నారు. ఎప్పటి కి ఈ రహదారి సమస్యలు పరిష్కారం అయితయో వేచి చూడాలి మరి.



# గణేష్ ఉత్సవ నూతన కమిటీ ఎన్నిక

**చౌటుప్పల్ టౌన్,విశాలభారతి:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్ టాకీస్ వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించే గణేష్ ఉత్సవ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కమిటీ నూతన అధ్యక్షుడిగా "తూర్పునూరు లింగస్వామి గౌడ్" ని సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ ప్రజలందరూ దైవభక్తి కలిగి ఉండాలని తమ పిల్లలకు హిందు పండగల గురించి తెలియజేయాలని తెలిపారు. నేను ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని నాకు ఈ అవకాశం ఇచ్చిన సంఘ నాయకులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ మాజీ అధ్యక్షుడు చెరుకు లింగస్వామి గౌడ్ మరియు నాయకులు పాల్గొనడం జరిగింది.



# కింగ్ నాగార్జున నా సామిరంగ

కింగ్ నాగార్జున అక్కినేని పుట్టినరోజు సందర్భంగా అభిమానులను ఆనందపరిచే విధంగా ఆయన కొత్త చిత్రాన్ని అనౌన్స్ చేశారు. పలు ప్రముఖ చిత్రాలకు పనిచేసిన పాపులర్ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని మాస్ జాతరగా రూపొందుతున్న ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. టాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ నిర్మాత శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించనున్నారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. రిచ్ ప్రొడక్షన్ డిజైన్, అత్యుత్తమ టెక్నికల్ స్టాండర్డ్స్ తో రూపొందనున్న ఈ సినిమాను అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. మరో బిగ్ సర్ ప్రైజ్ గా మేకర్స్ ఒక గ్లింప్స్ , ఫస్ట్‌లుక్ పోస్టర్ ద్వారా సినిమా టైటిల్‌ను కూడా ప్రకటించారు. ఈ చిత్రానికి 'నా సామిరంగ' అనే క్యాచీ టైటిల్‌ని ఖరారు చేశారు. టైటిల్ వినగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది ఏఎన్ఆర్ కల్ట్ హిట్ 'సిపాయి చిన్నయ్య' లోని నా సామి రంగ అనే ఐకానిక్ సాంగ్. నాగార్జున ఫస్ట్ లుక్ పోస్టర్‌లో బీడీ తాగుతూ మాసీ హెయిర్ స్టయిల్, గడ్డంతో మాస్ అవతార్ లో కనిపించారు. టైటిల్ గ్లింప్స్ 'నా సామి రంగ' వరల్డ్ ని మనకు పరిచయం చేస్తుంది. పలాస ఫేమ్ కరుణ కుమార్ & అతని గూండాల బ్యాచ్ హీరోని చంపడానికి చూస్తున్నప్పుడు.. సింబాలిక్‌గా కింగ్‌గా పరిచయం అవుతారు. ఇక నాగార్జున ఎంట్రీతో అసలు మాస్ జాతర మొదలవుతుంది. అతని పేరు వినగానే ప్రత్యర్థులు వణుకుతున్నప్పుడు అతను వారిపై దాడి చేయడం మొదలుపెడతాడు. నాగార్జున మాస్ లుక్, ఎక్స్ టార్డీనరీ స్క్రీన్ ప్రెజెన్స్ సీక్వెన్స్‌కు బలాన్ని తెచ్చింది. విజువల్స్ అత్యుత్తమంగా వున్నాయి. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పర్ఫెక్ట్ ఎలివేషన్స్ ఇస్తుంది. ఫస్ట్ లుక్, టైటిల్ గ్లింప్స్‌తో అంచనాలు ఆకాశాన్ని తాకాయి.


# 'భైరవద్వీపం' 4కె ట్రైలర్ విడుదల

1974లో అద్భుతమైన అరంగేట్రం చేసిన నటసింహ నందమూరి బాలకృష్ణ సినీ పరిశ్రమలో 50 గ్లోరియస్ ఇయర్స్ పూర్తి చేసుకున్నారు. ఈ అద్భుతమైన ప్రయాణాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి నటసింహ బాలకృష్ణ ఆల్ టైమ్ క్లాసిక్ హిట్ "భైరవద్వీపం" ఈ తరం ప్రేక్షకులను అద్భుత ప్రపంచంలోకి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉంది. 1994లో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఈ ఎవర్‌గ్రీన్ ఫాంటసీ ఎంటర్‌టైనర్... క్లాప్ ఇన్ఫోటైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా రీ-రిలీజ్ అవుతోంది. ప్రేక్షకులకు మెమరబుల్ సినిమాటిక్ అనుభూతిని అందించి, బాక్సాఫీస్ వద్ద అద్భుతాలను సృష్టించిన ఈ చిత్రం.. అప్‌గ్రేడ్ చేసిన 4కె క్వాలిటీతో ఆగస్ట్ 30, 2023న ప్రేక్షకుల ముందుకు రానుంది. టాలీవుడ్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, బాబీ, గోపీచంద్ మలినేని ఈరోజు సాయంత్రం 4 గంటలకు ఆదిత్య మ్యూజిక్‌లో రీ-రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ తరం ప్రేక్షకులకు థియేటర్లలో అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని పంచబోతుందని ట్రైలర్ భరోసా ఇచ్చింది. క్లాప్స్ ఇన్ఫోటైన్‌మెంట్ పివి గిరి రాజు, పి దేవ్ వర్మ 'భైరవ ద్వీపం' రీ రిలీజ్ తో ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందించనున్నారు. విజయ్ చెడుతో పోరాడి, యువరాణిని ఎలా కాపాడతాడు అనేది.. గొప్ప మలుపులతో, అద్భుతమైన దృశ్యాలతో కూడిన విజువల్ వండర్ 'భైరవ ద్వీపం'.




# ఎంపీ సంతోష్ కుమార్ క్లాప్ తో రాకింగ్ రాకేష్ కొత్త చిత్రం

గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో విభూది క్రియేషన్స్ పతాకంపై గరుడవేగ మేకింగ్స్ ప్రొడక్షన్ నెంబర్ 1 ఈ రోజు పూజా కార్యక్రమాలతో గ్రాండ్ గా ప్రారంభమైయింది. 'జబర్దస్త్' షో తో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రాకింగ్ రాకేష్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నారు. గరుడవేగ లాంటి ఎన్నో అద్భుతమైన చిత్రాలకు డీవోపీ గా పని చేసిన అంజి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అనన్య హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రం లాంచింగ్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది. తెలంగాణ ఎంపీ (రాజ్యసభ) సంతోష్ కుమార్ క్లాప్ కొట్టారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి రోజా సెల్వమణి కెమరా స్విచాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి తనికెళ్ళ భరణి గౌరవ దర్శకత్వం వహించగా సాయి కుమార్ మేకర్స్ కి స్క్రిప్ట్ అందజేశారు. చిత్ర ప్రారంభోత్సవంలో తెలంగాణ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో ఫౌండర్ రాఘవ, వివిఎన్ ఆదిత్య, ప్రవీణ, అనిల్ కడియాల, ధనరాజ్, తాగుబోతు రమేష్, అదిరే అభి తదితరులు పాల్గొన్నారు. లాంచింగ్ ఈవెంట్ లో ఎంపీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. రాకేష్ కి ఆల్ ది వెరీ బెస్ట్. తను ఇంకెన్నో చిత్రాలు చేయాలి. మంచి నటుడిగా, నిర్మాతగా గా పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను. చిత్ర యూనిట్ కు ఆల్ ది బెస్ట్'' తెలిపారు. మంత్రి రోజా సెల్వమణి మాట్లాడుతూ.. రాకేష్ నా కొడుకు లాంటివాడు. ఎప్పటి నుంచో తనకి లీడ్ రోల్ చేయాలని వుంది. ఈ సినిమాతో అది నెరవేరుతోంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించి మరెన్నో సినిమాలు చేసి ప్రజలకు ఆనందాన్ని పంచాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను.




# 'జవాన్' నుంచి సాంగ్ రిలీజ్

కింగ్ ఖాన్ షారూఖ్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ 'జవాన్'. హ్యూజ్ ఎక్స్‌పెక్టేషన్స్ తో సెప్టెంబర్ 7న రిలీజ్ అవుతోన్న ఈ సినిమానుంచి మంగళవారం 'నాట్ రామయ్యా వస్తావయ్యా' సాంగ్ ను మేకర్స్ విడుదల చేశారు. రీసెంట్ గా #AskSRK సెషన్ లో షారూఖ్ తన అభిమానులతో మాట్లాడుతూ 'నాట్ రామయ్యా వస్తావయ్యా' సాంగ్ గ్లింప్స్ ను విడుదల చేసి ఆశ్చర్యంలో ముంచెత్తారు. దీంతో మూడో సాంగ్ ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూడసాగారు. ఎట్టకేలకు ఈ నిరీక్షణకు తెరపడుతూ 'నాట్ రామయ్యా వస్తావయ్యా..' సాంగ్ విడుదలైంది. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్లు 'నాట్ వస్తావయ్యా'ను అద్భుతంగా తెరకెక్కించారు. పాట చూస్తుంటే పార్టీ నెంబర్ లా ఉంది. ప్రోమోలో షారూఖ్ ఎనర్జీ, ఛార్మ్ అందరినీ ఆకట్టుకుంది. ఇప్పుడు సాంగ్ లో అది రెట్టింపుగా కనిపిస్తుంది. డాన్స్ మూవ్స్ ట్రెండ్ సెట్టింగ్ గా ఉన్నాయి. పాటను హిందీ, తెలుగు, తమిళ భాషల్లో మేకర్స్ విడుదల చేశారు. సాంగ్ పార్టీ వైబ్స్ తో అలరిస్తుంది. హిందీ వెర్షన్ లో 'నాట్ రామయ్యా వస్తావయ్యా' పాటకు అనిరుద్ రవిచందర్ సంగీతాన్ని అందించారు. పాటకు కుమార్ సాహిత్యాన్ని అందించారు. అనిరుద్, విశాల్ దడ్లాని, శిల్పా రావు పాటను తమదైన స్టైల్లో అద్భుతంగా ఆలపించారు. వైభవ్ మర్చంట్ పాటకు కొరియోగ్రఫీని అందించారు. తెలుగు వెర్షన్ పాటను ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ రాయగా శ్రీరామచంద్ర, రక్షిత సురేష్, అనిరుద్ పాడారు. ఇక తమిళ వెర్షన్ సాంగ్ కు వివేక్ సాహిత్యాన్ని అందించారు. అనిరుద్, శ్రీరామ్ చంద్ర, రక్షిత సురేష్ పాటను పాడారు.





# బాయ్స్ హాస్టల్ కు నెక్స్ట్ లెవల్ రెస్పాన్స్ వస్తోంది



టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి కన్నడ బ్లాక్ బస్టర్ హాస్టల్ హుడుగారు బేకగిద్దరేను తెలుగులో 'బాయ్స్ హాస్టల్' పేరుతో గ్రాండ్ గా విడుదల చేశాయి. నితిన్ కృష్ణమూర్తి ఈ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. ఇందులో ప్రజ్వల్ బిపి, మంజునాథ్ నాయక, రాకేష్ రాజ్‌కుమార్, శ్రీవత్స, తేజస్ జయన్న ఉర్స్ ప్రధాన పాత్రలు పోషించారు. బాయ్స్ హాస్టల్ ఆగస్టు 26న తెలుగులో విడుదలై బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించి 'స్టూడెంట్ ఫిల్మ్ అఫ్ ది ఇయర్' గా నిలిచింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది. సక్సెస్ మీట్ లో నిర్మాత సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ.. మంచి కంటెంట్ ఎక్కడున్నా ఆదరించడం తెలుగు ప్రేక్షకుల ప్రత్యేకత. 'హాస్టల్ బాయ్స్' చిత్రంతో అది మరోసారి రుజువయింది. థియేటర్ లో ప్రేక్షకుల నవ్వులు చూస్తున్నపుడు వచ్చే తృప్తి వేరు. అలాంటి గొప్ప తృప్తి, మజాని ఇచ్చిన చిత్రమిది. నాగార్జున గారు ఈ సినిమా చేస్తున్నపుడు ఏ జోనర్ సినిమా అని అడిగారు. ఏం చెప్పాలో కాసేపు ఆలోచించాను.(నవ్వుతూ). ఎందుకంటే ఇది చాలా కొత్త తరహా చిత్రం. నాగర్జున గారు ఈ సినిమా చూసి.. 'చాలా యూనిక్ గా వుంది కదా' అన్నారు. దర్శకుడు నితిన్ కృష్ణ మూర్తి మాట్లాడుతూ.. ఇది తెలుగు సినిమాలా వుండాలని చాలా హార్డ్ వర్క్ చేసి డబ్ చేశాం. అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ నిర్మాతలకు థాంక్స్. తెలుగులో వస్తున్న ఆదరణ గొప్ప ఆనందాన్ని ఇస్తోంది. కొత్త వారిని సపోర్ట్ చేయడంలో తెలుగు ప్రేక్షకులు ఒక అడుగుముందు ఉంటారని విన్నాను. ఇప్పుడు చూస్తున్నాను. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు'' తెలిపారు. ఈ ప్రెస్ మీట్ లో బాయ్స్ హాస్టల్ చిత్ర యూనిట్ పాల్గొన్నారు.

# గెట్ రెడీ అంటున్న నభా

హాట్ బ్యూటీగా నభా నటేష్ ఏడాదిగా సినిమాలకు దూరంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. భుజానికి తీవ్రమైన గాయమవ్వడం సహా మల్టీ పుల్ బోన్ ఫ్రాక్చర్ కావడంతో పాటు కొన్ని రకాల కాంప్లికేటెడ్ సర్జరీలు కూడా జరిగాయి. అమ్మడి జీవితంలో అనుకోకుండా జరిగిన ప్రమాదం ఇది. దీంతో శారీరకంగా..మానసికంగా ఎంతో పెయిన్ అనుభవంచింది. ఈ నేపథ్యంలో సినిమాలకు దూరమవ్వాల్సి వచ్చింది. పూర్తిగా ఇంటికి పరిమితమై విశ్రాంతి తీసుకుంటుంది. అయితే ఇప్పడా సమస్యని అధిగమించి రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ మ్యాకప్ వేసుకోవడానికి రెడీ అవుతోంది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా రివీల్ చేసింది. లాక్ డౌన్ సమయంలో ప్రతీ ఒక్కరూ వారి వృత్తికి దూరంగా ఉన్నారు. కానీ నేను మాత్రం ఓ ప్రమాదం కారణంగా మొన్నటివరకూ లాక్ డౌన్ లోనే ఉన్నాను. ఇప్పడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను. రెట్టింపు ఉత్సాహంతో మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను' అంది. తెలుగు.. తమిళ్ లో కొన్ని సినిమాలకు ఒకే చెప్పినట్లు సమాచారం. అయితే ఆ విషయాన్ని అధికారికంగా వెల్లడించలేదు. నన్ను దోచుకుందువటే సినిమాతో అమ్మడు టాలీవుడ్ కి పరిచయమైంది. అటుపై ఇస్మార్ట్ శంకర్ సినిమాతో బాగా ఫేమస్ అయింది. ఇందులో అమ్మడి నటనకి మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. అంతకు ముందు.. ఆతర్వాత డిస్కో రాజా..మాస్ట్రో..అల్లుడు అదుర్స్..బ్రతుకే సో బెటర్.. అదుగో లాంటి చిత్రాల్లో నటించింది. కానీ ఇవేవి విజయం సాధించలేదు. దీంతో అవకాశాల రేసులోనూ కాస్త వెనుక బడింది. ఇంతలో భుజానికి గాయమవ్వడంతో వెండి తెరకు పూర్తిగా దూరమవ్వాల్సి వచ్చింది. మరి కంబ్యాక్ లో ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో? చూడాలి. ప్రస్తుతం హీరోయిన్ల మధ్య ఎలాంటి పోటీ ఉందో తెలిసిందే. ఈ మధ్య కాలంలో తెలుగు భామల వేగం కూడా టాలీవుడ్ లో పెరుగుతుంది. చిన్న సినిమాల్లో తెలుగు హీరోయిన్లకు అవకాశాలు వరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాళ్లతోనూ కొత్త భామలు..కంబ్యాక్ హీరోయిన్లు పోటీ పడాలి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.